**బూర్గంపాడు /విశాలభారతి:** మొరంపల్లి బంజర స్టెల్లా మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి.తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మను విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ప్రదర్శించారు.ఈ నేపథ్యంలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ ఆటపాటలతో ఉత్సాహంగా నృత్యాలు చేశారు. పూలతో అలంకరించిన బతుకమ్మలు పాఠశాల ప్రాంగణానికి ప్రత్యేక శోభను తీసుకువచ్చాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, ఐకమత్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెవ. సిస్టర్ సుమలత విద్యార్థులకు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడం, భావితరాలకు వాటిని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐకమత్యం, సృజనాత్మకత, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని సూచించారు.ఉపాధ్యాయులు, విద్యార్థుల సమష్టి కృషితో బతుకమ్మ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిశాయి. ఈ వేడుకలు విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి పట్ల గౌరవాన్ని, మన సంప్రదాయాలను పరిరక్షించాలనే స్ఫూర్తిని నింపాయి.

## శ్రీ చైతన్య కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ**
- **భవిష్యత్ తరాలకు మన సంస్కృతిని అందించాలి**
- **కళాశాల చైర్మన్ చల్లగాలి మోజేష్**



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రముఖ వృత్తి విద్యా జూనియర్ కళాశాల శ్రీ చైతన్య కళాశాలలో తెలంగాణ పూల పండుగ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. తిరుమలేష్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ చల్లగాలి మోజేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, బతుకునిచ్చే పండుగగా, ప్రకృతిని పూజించే గొప్ప సంప్రదాయంగా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని అన్నారు. ప్రకృతితో మమేకమై పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ రాష్ట్ర సొంతమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు తరతరాలకు అందేలా ప్రతి ఒక్కరూ వాటిని పరిరక్షించాలని సూచించారు. మన మూలాలను, మన సంస్కృతిని కాపాడుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు వాటిని అందించే బాటసారులుగా మనం నిలవాలని చల్లగాలి మోజేష్ పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఆటపాటలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బతుకమ్మ తల్లికి ఘనంగా నీరాజనాలు పలుకుతూ తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, అరుణ, లిఖిత, యమున, నాగరాజు, సునీతతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక



**మోతె అక్టోబర్ 9 విశాల భారతి ;** శుక్రవారం మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షులు గా బోడపట్ల పూర్ణ చందర్ ఉపాధ్యక్షులుగా పల్లెల రేణుక గౌరవ అధ్యక్షులు గా తండు శ్రావణ్ జనరల్ సెక్రటరీగా చెవుల నాగరాజు కోశాధికారి గా కొల్లు శ్వేత మీడియా కోఆర్డినేటర్‌గా సి హెచ్ దేవేందర్ కమిటీ సభ్యులుగా రాము కవిత సౌమ్య సింధు ఉపేందర్ మురళి ఎంపికయ్యారు ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులు మాట్లాడుతు మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల మధ్య సమన్వయన్ని పెంపొందిస్తూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు మండలంలోని పంచాయతీ కార్యదర్శులందరి సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లొ ఆయ గ్రామాల కార్యదర్శి లు తదితరులు పాల్గొన్నారు

## చేనేత కార్మికులకు ఉచితంగా కంటి అద్దాల పంపిణీ

- **61 మంది కార్మికులకు అద్దాలు అందజేసిన చైర్మన్ దాసి శంకర్, డాక్టర్ హైమావతి**



**ఆలేరు, విశాల భారతి:** చేనేత కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ దాసి శంకర్ తెలిపారు. గతంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ సహకారంతో చేనేత సహకార సంఘం వద్ద నిర్వహించిన వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న కార్మికులకు శుక్రవారం ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ దాసి శంకర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హైమావతి చేతుల మీదుగా మొత్తం 61 మంది చేనేత కార్మికులకు అద్దాలను అందజేశారు. చేనేత కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సొసైటీ కార్యదర్శి గాడిపల్లి రమేష్, వైస్ చైర్మన్ చింతకింది రంగ, CHO సత్యవతి, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, సంతోషిని, ఆశా కార్యకర్తలు రమ, వాణి, ఆరోగ్య సిబ్బంది, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు షాక్.. బీఆర్ఎస్‌లోకి చేరికలు

- **మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ సమక్షంలో పలువురి చేరిక.**
- **పెద్దనాగారంలో పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే.**

**నరసింహులపేట విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** నరసింహులపేట మండలం పెద్దనాగారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే శ్రీ డీఎస్ రెడ్యానాయక్ సమక్షంలో చలమల్ల భాస్కర్ కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పార్టీ కండువా కప్పి సాదరంగా బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అదేవిధంగా అజ్మీర తండా గ్రామపంచాయతీకి చెందిన లూనావత్ లక్ష్మీ, బానోత్ వెంకన్న, మోహన్ తదితరులు కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు గుజి వీరస్వామి, మధు, శ్రీకాంత్, కొమ్ము పుల్లయ్య, అల్లిపురపు రవీందర్‌రెడ్డి, లింగారెడ్డి, అజ్మీర లింగనాయక్, గంట రాములు, గాదుదుల్ల కొమురెల్లి, గంట మహేష్, కొమ్ము మధు, బింగి విక్రమ్, రుణావత్ రాములు, కొమ్ము వీరభద్రం, సతీష్, దుర్గయ్య, ఉపేందర్, భాస్కర్ చలమల, ఉపేందర్, ప్రభాకర్, లింగమలు, వెంకన్న, చలమల్ల శ్రీను, బానోత్ రమేష్, బానోత్ చీమ, బానోత్ లచ్చు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విద్యుత్తు అందించాలి




**అడ్డగూడూర్ విశాల భారతి;** అడ్డగూడూరుథ్య మండలాన్ని కరువు మండలముగా ప్రకటించాలని.... తహసీల్దార్ శేషగిరిరావుకు వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ అడ్డగూడూర్ మండల శాఖ... రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందక, విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం... తుంగతుర్తి నియోజకవర్గానికి గతంలో కాళేశ్వరం ద్వారా అందించిన నీళ్లు ప్రస్తుతం కనిపించడం లేదని, రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు.పంటలు అన్ని పొట్ట దశలో ఉన్నయని,,. ఈ సమయంలో నిరంతరాయంగా విద్యుత్ అందిస్తే పంటలు గట్టెక్కే అవకాశం ఉంది. కానీ ఈ ప్రభుత్వం కనీస మానవత్వం లేకుండా వ్యవహరిస్తూ విద్యుత్ సరఫరా చేయడం లేదు. దీంతో పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయి అని అన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఎండిపోయిన పంట పొలాలు, నెర్రలు వారిన నేలలు, రైతుల కన్నీళ్లే కనిపిస్తున్నాయని అన్నారు.. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడానికి అధికారులు, ప్రభుత్వం స్పందించడం లేదు.అడ్డగూడూర్ మండల కేంద్రాన్ని కరువు మండలంగా ప్రకటించాలని తహసీల్దార్ శేషగిరి రావుకు వినతి పత్రాన్ని బిఆర్ఎస్ అడ్డగూడూర్ మండల శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు.యాదాద్రి పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ కావాలనే ఉత్పత్తి చేయడం లేదని అన్నారు.. సాగునీరు, విద్యుత్ కొరతతో వ్యవసాయ రంగం అస్తవ్యస్తంగా మారిందన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణశాఖ అధ్యక్షులు నాగులపల్లి దేవగిరి,స్థానిక సర్పంచ్ పూజారి వనజ సైదులు గౌడ్,మాజీ ఎంపిటీసి పూలపెల్లి జనార్ధన్ రెడ్డి,మాజీ సింగిల్ విండో చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు,మాజీ యంపిపి దర్శనాల అంజయ్య,ఆయా గ్రామాల సర్పంచ్ లు,పాశం విష్ణువర్ధన్ రావు, చుక్క బాబు, మందుల రేణుక కిరణ్, వివిధ గ్రామాల ఉప సర్పంచ్ లు,వివిధ గ్రామాల అధ్యక్షకార్యదర్శులు, మాజీ సర్పంచ్ ఉప సర్పంచ్ లు,ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు, యువకులు బిఆర్ఎస్ కార్యకర్తలు పార్టీ అభిమానులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హి సేవా భాగంగా చెత్త బుట్టలు,మొక్కల పంపిణీ



- **పట్టణ పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత**
- **మొగుదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్ పర్సన్**

**చౌటుప్పల్,విశాల భారతి:** స్వచ్ఛతా హి సేవా 2026 కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ పురపాలక సంఘం కార్యాలయంలో చెత్త బుట్టలు, మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పురపాలక సంఘ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు, సంఘాల మొదటి, రెండవ స్థాయి లీడర్లకు తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, చెత్తను సరైన పద్ధతిలో నిర్వహించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం చైర్ పర్సన్ పావని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. పట్టణ పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఇంట్లో తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. ప్రజలందరూ పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ చౌటుప్పల్ పట్టణాన్ని స్వచ్ఛమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు కొండనం రాకేష్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, ఉడుతల యాదయ్య, కొయ్యడ శేఖర్ గౌడ్, ఆలా శ్రీలత చిరంజీవి, కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, బొల్లి గాలయ్య, దేప రమ్య రాజు, పాక చిరంజీవి, భత్తుల వాణి విప్లవ్ కుమార్, ఉడుగు జ్యోతి రమేష్, గడ్డం ఇందిరా రాజరత్నం, భత్తుల జయమ్మ దాసు, చింతల ఉమామహేశ్వరి సాయిలు, బుడ్డ సురేష్, పిల్లలమర్రి మధుసూదన్, హన్ను మహమ్మద్, పస్తం గంగారాములు, సందగళ్ల విజయ సతీష్, మహమ్మద్ బాబా షరీఫ్, షేక్ నాబీబి జానీ బాబా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధుల ఆశీర్వాదాలే మా కుటుంబానికి కొండంత బలం: ఏల మంజు సుందర్

- **ఐదేళ్లుగా అనాథ వృద్ధులకు అండగా సుందర్ చారిటబుల్ ట్రస్ట్**
- **ప్రేమా సదన్‌లో మందులు, పండ్ల పంపిణీ.. నెలనెలా రూ.8 వేల నుంచి రూ.10 వేల విలువైన మందులు ఉచితం**



**దేవరుప్పుల విశాల భారతి:** సేవే లక్ష్యంగా.. వృద్ధుల సంక్షేమమే ధ్యేయంగా సుందర్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ కుటుంబం గత ఐదేళ్లుగా సీతారాంపురం గ్రామంలోని ప్రేమా సదన్ అనాథ వృద్ధుల శరణాలయంలో ఉంటున్న వృద్ధులకు అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకుంటోంది. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రూ.8 వేల నుంచి రూ.10 వేల విలువైన మందులను ఉచితంగా అందజేస్తూ వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఏల సుందర్ సతీమణి ఏల మంజులత ప్రేమా సదన్‌ను సందర్శించి వృద్ధులకు మందులు, పండ్లు పంపిణీ చేశారు. వారితో ఆప్యాయంగా మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏల మంజులత మాట్లాడుతూ, వృద్ధుల ఆశీర్వాదాలే తమ కుటుంబానికి కొండంత బలమని అన్నారు. ఆదరణకు నోచుకోని వృద్ధులకు అండగా నిలవడం, వారికి అవసరమైన వైద్య సహాయం అందించడంతో పాటు ఆప్యాయతను పంచడం ఎంతో సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు.ఐదేళ్లుగా తమకు అండగా నిలుస్తూ, అవసరమైన మందులు అందిస్తున్న ఏల సుందర్ కుటుంబానికి ప్రేమా సదన్ వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు. ఆ కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు.ఆర్థిక సహాయంతో పాటు ఆత్మీయతను, భరోసాను అందిస్తున్న సుందర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు పలువురి ప్రశంసలు అందుకుంటున్నాయి. ఐదేళ్లుగా నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమాలు సామాజిక బాధ్యతకు, మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## బతుకమ్మలతో పాఠశాల ప్రాంగణం కళకళ

- **బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు ప్రకృతి**
- **మోగదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్ పర్సన్**
- **విద్యతో పాటు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాం**
- **కరస్పాండెంట్ గుత్తా గోపాల్ రెడ్డి**



**చౌటుప్పల్,విశాల భారతి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మొగదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థినులు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీక అని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, విద్యార్థి దశ నుంచే పండుగల విశిష్టతను తెలుసుకోవడంతో పాటు సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు.పాఠశాల కరస్పాండెంట్ గుత్తా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యతో పాటు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థినులకు తెలియజేస్తూ, మన సంప్రదాయాలను కాపాడుకోవాలనే భావనను వారిలో పెంపొందిస్తున్నామన్నారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో, విద్యార్థినుల ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉయ్యాల రమేష్, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగ సందర్భంగా తగిన ఏర్పాట్లు చేయిస్తున్న గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ



**మునగాల విశాల భారతి:** మండల పరిధిలోని నర్సింహా పురం గ్రామ పంచాయతీ లో గ్రామం లో రేపటి నుంచి జరిగే. ఎంగిలి పువ్వు బతుకమ్మ. కార్యక్రమం.నుంచి సద్దుల బతుకమ్మ సందర్భంగా గ్రామం లో ఉన్న. శ్రీ కోదండరామ స్వామి కళ్యాణ మంటపం ప్రాంగణం వద్ద. ఐమ్యాక్స్ లైటింగ్. వెలుగులు. అలాగే. శ్రీ కోదండరామ స్వామి దేవాలయం పక్కన ఉన్న కోనేరు లో. నిమజ్జనం. చేసే. ప్రాంతంలో. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి మరియు మండల అధికారుల ఆదేశాల మేరకు నేడు ఆ ప్రాంగణం లో. చెత్త పిచ్చి మొక్కలు. కంప చెట్లను తొలగించి. అక్కడ నిమజ్జనం సాజావుగా. చేసే విధంగా. శుభ్రం చేయించినట్లు గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ తెలిపారు ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ. తమ గ్రామంలో దాదాపుగా 60 సంవత్సరాలకు పైగా క్రమం తప్పకుండా. మహిళలు పెద్ద ఎత్తున ఈ బతుకమ్మ పండుగను నిర్వహించడం జరుగుతుందని. అలాగే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇంకా ప్రాధాన్యత. పెరిగి గ్రామంలో. అన్ని వర్గాల కు చెందిన మహిళలందరూ ఒకే చోట గ్రామంలో ఉన్న శ్రీ కోదండరామ స్వామి కళ్యాణ మంటపం ప్రాంగణంలో. బతుకమ్మ ఆడి. తదనంతరం గ్రామంలో దేవాలయం పక్కన ఉన్న కోనేరులో నిమజ్జనం చేస్తారని. సాంప్రదాయ పద్ధతిలో పాటలు పాడుతూ అక్కడ బతుకమ్మలు. ఆడే వద్ద శుభ్రం చేయించి లైటింగ్ ఏర్పాటు చేసి అలాగే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు కల్పించడమే కాకుండా నిమజ్జనం చేసే కోనేరు వద్ద కూడా తగిన లైటింగ్ . మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేసి తగు జాగ్రత్తలు తీసుకుంటామని అలాగే గ్రామంలో ఉన్న. ప్రతి మహిళ ఈ బతుకమ్మ సంబరాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## రోడ్డుపై బతుకమ్మ సంబరాలతో ప్రజలకు ఇబ్బందులు

- **చౌరస్తాలో గంటసేపు ట్రాఫిక్ నిలిపివేత.. పాఠశాల ఆవరణలోనే వేడుకలు నిర్వహించాలని ప్రజల డిమాండ్**





**దేవరుప్పుల విశాల భారతి;** దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలయేసు పాఠశాల యాజమాన్యం విద్యార్థులతో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ సంబరాలు ప్రజలకు ఇబ్బందులు కలిగించాయి. సూర్యాపేట నుంచి జనగామకు వెళ్లే ప్రధాన రహదారితో పాటు దేవరుప్పుల గ్రామంలోకి వెళ్లే మూడు రహదారులు కలిసే చౌరస్తాలో సుమారు గంట సేపు ట్రాఫిక్‌ను నిలిపివేసి వేడుకలు నిర్వహించడంపై ప్రయాణికులు, స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.బతుకమ్మ సంబరాలు నిర్వహించడం స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ప్రధాన రహదారిపై కార్యక్రమాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. గతంలోనూ ఇలాంటి కార్యక్రమాలతో ఇబ్బందులు ఎదురయ్యాయని, ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తే వారికి నోటీసులు పంపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పాఠశాల ఆవరణలో, పెద్ద గ్రౌండ్, ఫంక్షన్ హాలు, లలో నిర్వహిచు కోకుండా ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించడం సరికాదని బాటసారులు అభిప్రాయపడుతున్నారు. అత్యంత రద్దీగా ఉండే ప్రధాన కూడలిలో ట్రాఫిక్‌ను నిలిపివేయడం వల్ల అత్యవసరంగా వెళ్లాల్సిన వారికి సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రధాన రహదారులపై ప్రజలకు ఇబ్బందులు కలిగించే కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## టీబి రహిత గ్రామపంచాయతీలుగా జక్కల వారి గూడెం,గుండ్లోరిగూడెం





**మునుగోడు, విశాల భారతి ;** జిల్లా కేంద్రంలో గురువారం కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'టీబీ ముక్త్ పంచాయత్-2025' లో మునుగోడు మండలంలోని జక్కల వారి గూడెం, గుండ్లోరిగూడెం గ్రామపంచాయతీలకు టీబీ రహిత పంచాయతీలుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ చేతుల మీదుగా ఆయా గ్రామాల సర్పంచులు ధ్రువీకరణ పత్రాలను స్వీకరించారు. ఈ ధ్రువీకరణ పత్రాలు అందుకున్న వారిలో గుండ్లోరిగూడెం సర్పంచ్ జంగిలి సునీత సాంబయ్య, జక్కలవారిగూడెం సర్పంచ్ జక్కలి రేవతి-మహేష్, ఉన్నారు. గ్రామాల్లో టీబీ కేసులను సకాలంలో గుర్తించడం, బాధితులకు నిరంతర చికిత్స అందించడం, వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో సాధించిన ప్రగతికి ఈ గుర్తింపు లభించింది. టీబీ రహిత గుర్తింపు రావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- **అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటు హక్కును వినియోగించుకోవాలి**
- **కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పదిలోజు నరహరి పిలుపు**



**పాల్వంచ విశాల భారతి:** ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా తమ పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పదిలోజు నరహరి పిలుపునిచ్చారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించేందుకు ఓటు హక్కు కీలకమని ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టభద్రుల భాగస్వామ్యం పెరగాలంటే ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

**కాంగ్రెస్ శ్రేణులు ప్రత్యేక చొరవ చూపాలి**

ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని నరహరి కోరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసుకోవడంతో పాటు, తమ పరిచయాల్లోని అర్హులైన గ్రాడ్యుయేట్లకు కూడా అవగాహన కల్పించి ఓటరు నమోదుకు సహకరించాలని సూచించారు.

# దసరా వేళ ప్రయాణికుల పాట్లు

- షాద్‌నగర్ బస్టాండ్‌లో బస్సుల కోసం పడిగాపులు!
- పండుగ రద్దీకి సరిపోని బస్సులు.. గంటల తరబడి నిరీక్షణ
- సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రయాణికుల అవస్థలు..
- అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్

**విశాల భారతి:**




షాద్ నగర్:రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఒకవైపు దసరా పండుగ సెలవులు.. మరోవైపు సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రయాణికుల రద్దీ పెరగడంతో బస్టాండ్ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అయితే ప్రయాణికుల అవసరాలకు తగినట్టుగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండుగ పూట కుటుంబ సభ్యులతో సొంత గ్రామాలకు చేరుకోవాల్సిన ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. దసరా పండుగను పురస్కరించుకొని పట్టణాలు, నగరాల్లో నివసించే అనేకమంది ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళ్లేందుకు శుక్రవారం షాద్‌నగర్ బస్టాండ్‌కు చేరుకున్నారు. దీంతో బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. పల్లెలకు వెళ్లే మార్గాల్లో తగినన్ని బస్సులు లేకపోవడంతో ఏ బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక ప్రయాణికులు అయోమయానికి గురయ్యారు. బస్సు రాగానే అందులోకి ఎక్కేందుకు ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు కనిపించాయి. ముఖ్యంగా కుటుంబాలతో వచ్చినవారు, చిన్నపిల్లలను వెంట తీసుకొచ్చిన మహిళలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఇదే సమయంలో శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగుల సంఘం ఎన్నికలు కూడా జరగడంతో సిబ్బంది ఎన్నికల కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. పండుగ రద్దీకి అనుగుణంగా బస్సుల నిర్వహణ, ప్రయాణికులకు అందించాల్సిన సేవలపై తగినంత దృష్టి సారించలేకపోయారనే అభిప్రాయాలు ప్రయాణికుల నుంచి వ్యక్తమయ్యాయి. అయితే బస్సుల కొరతకు ఎన్నికలే కారణమా, ఇతర నిర్వహణ సమస్యలున్నాయా అన్నది అధికారుల వివరణతో స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమల్లో ఉండటంతో పండుగ రద్దీ సమయంలో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య మరింత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా బస్సులను పెంచకపోతే మహిళలు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. బస్సులు వచ్చినప్పుడు వాటిలో సీట్లు దొరకకపోవడం, కిక్కిరిసిన బస్సుల్లో ప్రయాణించాల్సి రావడం వంటి సమస్యలు ప్రయాణికులకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి.

**పండుగ వేళైనా పట్టించుకోరా?**

దసరా వంటి ప్రధాన పండుగల సమయంలో ప్రయాణికుల రద్దీ పెరుగుతుందని తెలిసినా ముందస్తు ఏర్పాట్లు ఎందుకు చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. షాద్‌నగర్ నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గాల్లో అదనపు బస్సులు నడపాలని, బస్సుల రాకపోకలపై స్పష్టమైన సమాచారం అందించాలని, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పండుగ పూట సొంతూళ్లకు వెళ్లాలనే ఆనందంతో బస్టాండ్‌కు వచ్చిన ప్రజలకు బస్సుల కోసం పడిగాపులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి దసరా రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామీణ మార్గాల్లో సర్వీసుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. పండుగ రోజుల్లో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించి, వారి ప్రయాణ కష్టాలకు తెరదించాలని కోరుతున్నారు..

# రైతుల సమస్యలపై సమరశంఖం

- పెద్దనాగారం సబ్‌స్టేషన్ వద్ద పోటెత్తిన నిరసన..
- ప్రజల పక్షాన మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యా నాయక్.
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం..
- సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని స్పష్టం.
- రైతుల హక్కుల కోసం రాజీలేని పోరాటం.
- ప్రజల గొంతుకగా ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే.
- సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేస్తే ఉద్యమం మరింత ఉధృతం.

**నరసింహులపేట మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** రైతులు, ప్రజల సమస్యలపై పోరాటం ఉధృతమైంది. నరసింహులపేట మండలం పెద్దనాగారం సబ్ స్టేషన్ వద్ద రైతులు, ప్రజలు చేపట్టిన ధర్నా కార్యక్రమం ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరికగా మారింది. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఈ ఆందోళనలో డోర్నకల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యా నాయక్ పాల్గొని రైతులు, ప్రజలకు అండగా నిలిచారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అధికారులు కాలయాపన చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా రెడ్యా నాయక్ స్పష్టం చేశారు. రైతులు, సామాన్య ప్రజలు తమ హక్కుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజల గొంతును అణచివేయలేరు.. హక్కుల కోసం పోరాటం ఆపేది లేదు అనే రీతిలో ఆయన ప్రజలకు భరోసా కల్పించారు. రైతుల సమస్యలు, ప్రజల ఇబ్బందుల పరిష్కారం కోసం అవసరమైతే మరింత పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను తేలిగ్గా తీసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఇకనైనా అధికారులు స్పందించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ధర్నాలో పాల్గొన్న నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. పెద్దనాగారం సబ్ స్టేషన్ వద్ద జరిగిన ఆందోళన రైతులు, ప్రజల సమస్యలపై పోరాటానికి వేదికగా నిలిచింది.

# మోదుగులగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మోదుగులగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో బతుకమ్మలను పేర్చి, విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. సత్యనారాయణ చారి మాట్లాడుతూ.. తెలంగాణ ఉనికి, అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. "బతుకమ్మ అంటే బతకడం. తెలంగాణ ప్రజల జీవన విధానం, ఆత్మగౌరవం, సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే గొప్ప పండుగ బతుకమ్మ" అని పేర్కొన్నారు. విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాములు, లత, ఇందిర, సలీం, దీపిక, వీరన్న, రజిత, భాగ్యలక్ష్మి, టి. రమేష్, బలాస్టి రమేష్, వెంకన్న, లక్ష్మ, అనితరాణి, జహేదాబేగం, బేబీ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

- కాకతీయ స్కూల్ ప్రిన్సిపాల్ స్వాతి రెడ్డి..
- శ్రీ కాకతీయ టాలెంట్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

విశాల భారతి,షాద్ నగర్ :రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లోని భాగ్యనగర్ కాలనీ లో గల శ్రీ కాకతీయ టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ స్వాతి రెడ్డి అధ్యర్యంలో స్కూల్ లో బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు.చిన్నారి విద్యార్థులు డ్రాయింగ్ కాంపిటిషన్ లో పాల్గొని డ్రాయింగ్ వేశారు.అలాగే రంగురంగుల పువ్వులతో బతుకమ్మ లను తయారు చేశారు.అనంతరం బతుకమ్మ ఆటపాటలతో అలరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వాతి రెడ్డి మాట్లాడుతూ చిన్నప్పటి నుండే పిల్లలకు, విద్యార్థులకు భారతీయ సంస్కృతి,సాంప్రదాయం అలవర్చుకోవాలనే ఉద్దేశం తో ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అలాగే విద్యార్థులలో మేధస్సు వెలికితీయాలని వారితో డ్రాయింగ్ కాంపిటిషన్ చేయించడం జరిగిందని తెలిపారు. బతుకమ్మ పెర్చే పోటిల్లో తపశ్రీ మొదటి బహుమతి, కార్తీక్ రెండవ బహుమతి వైశాలి మూడవ బహుమతి పొందారు.ఈ కార్యక్రమాలలో స్కూల్ ఉపాధ్యాయ బృందం మరియు చిన్నారి విద్యార్థులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ఘనంగా ఎస్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ బతుకమ్మ సంబురాలు

- హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..
- బుగ్గారెడ్డి గార్డెన్ లో మారుమోగిన బతుకమ్మ ఆటా పాట



**విశాల భారతి , షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని బుగ్గారెడ్డి గార్డెన్స్‌లో ఎస్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ హాజరయ్యారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. బతుకమ్మ పాటలు, మహిళల సందడి, పండుగ కోలాహలం మధ్య వేడుకలు ఆహ్లాదకరంగా కొనసాగాయి.తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విశాల శ్రావణ్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, గిరిజన ఆదివాసీ రాష్ట్ర సమన్వయకర్త రఘు నాయక్, కౌన్సిలర్ సి. పెంటయ్య, మురళీ మోహన్, కొప్పునూరి ప్రవీణ్, దిలీప్, రాజు నాయక్, ముబారక్ అలీ ఖాన్, చందులాల్, బాలరాజు గౌడ్, కేకే కృష్ణ, కత్తి చంద్రశేఖరప్ప, గుట్ట రాజు తదితరులున్నారు..

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- సింగిల్ విండో చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి
- లింగారెడ్డిగూడలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం ఘనంగా..



**విశాల భారతి: షాద్ నగర్:** ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద మంజూరైన నూతన ఇంటి గృహప్రవేశ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన లబ్ధిదారుడు ఎండీ ఖదీర్ కుటుంబం నూతన గృహంలోకి ప్రవేశించిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి సింగిల్ విండో చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎంపీ ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ అశోక్, వార్డు సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి, పూజా కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారుడిని గృహప్రవేశం చేయించారు.. అనంతరం చల్లా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. లింగారెడ్డిగూడ గ్రామంలో తొలి విడతలో 25 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వాటిలో అనేక ఇళ్ల నిర్మాణాలు 80 శాతం వరకు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగు ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని వెల్లడించారు. పేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు లబ్ధిదారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు లబ్ధిదారుడు ఎండీ ఖదీర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎంపీ ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ అశోక్, వార్డు సభ్యులు ఎండీ మహారాజ్, గోద లక్ష్మయ్య యాదవ్, రంగంపల్లి శశాంక్ గౌడ్, వట్టెల మల్లేష్ యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ సందుగారి లక్ష్మీకాంత్ రెడ్డి, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు రంగంపల్లి సురేష్ గౌడ్, పయ్యాల హరికృష్ణ యాదవ్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగంపల్లి రమేష్‌గౌడ్, మాజీ ఉప సర్పంచులు సందుగారి నరేందర్ రెడ్డి, కాటి మల్లేష్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు గోద రమేష్ యాదవ్, రంగంపల్లి శ్రీధర్ గౌడ్, రంగంపల్లి వీరేష్ గౌడ్, బాలానగర్ సురేష్‌గౌడ్, షాబాద్ శంకరయ్య యాదవ్, ధనుల చందు యాదవ్, ఎర్రోళ్ల రామకృష్ణ, ఎర్రోళ్ల అరుణ్, బక్కని చిన్న నర్సింలు, చీపురు గణేష్‌యాదవ్, పయ్యాల మల్లేష్‌యాదవ్, ఎండీ మమ్మద్, షాబాద్ జంగయ్య యాదవ్, ఎండీ ఫరీద్, ఎండీ షరీఫ్, బీశ్వ యాదయ్య, సందుగారి భూపతి రెడ్డి తదితర గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# సమాచార హక్కుతో పారదర్శక పాలనకు బాట

- ప్రజలకు సమాచారం అందించడంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి
- ఆర్టీఐపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలి
- అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్

**మహబూబాబాద్ జిల్లా**
**విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.**

సమాచార హక్కు చట్టం పాలనలో పారదర్శకతకు కీలక ఆయుధమని, ప్రజా భాగస్వామ్యంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్ అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల పనితీరు, నిర్ణయాలు, ప్రజా సేవలకు సంబంధించిన సమాచారం పౌరులకు సకాలంలో అందుబాటులో ఉండేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సమాచార హక్కు వారోత్సవాలు 2026లో భాగంగా శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ప్రధాన సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం 2005పై జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ సమాచార కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, డీఆర్ఓ నాగలక్ష్మి, ఇతర అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు సమాచార హక్కు చట్టాన్ని గౌరవిస్తూ.. పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో అందిస్తామని, విధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 5 నుంచి 12 వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు వారోత్సవాల సందర్భంగా జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారం పొందేందుకు ప్రజలు అనుసరించాల్సిన విధానం, దరఖాస్తు ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధులు, పౌరులు, పౌరసమాజ సంస్థలను భాగస్వాములను చేస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం అమలులో ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు, మొదటి అప్పీళ్ల అధికారులు కీలక బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. చట్టంలోని నిబంధనలు, సమాచారాన్ని అందించాల్సిన గడువులు, విధి విధానాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలు కోరిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందించడంతో పాటు, సెక్షన్ 4(1)(బి) ప్రకారం స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన అవగాహన పత్రాలు, నోటీసులను ప్రజలకు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించాలని అన్నారు. సమాచారం కోసం కార్యాలయాలకు వచ్చే పౌరులకు దరఖాస్తు విధానం, సంబంధిత ప్రక్రియపై అధికారులు తగిన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉంటే పాలనపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం కేవలం చట్టపరమైన బాధ్యతగా కాకుండా రోజువారీ పరిపాలనలో భాగంగా ఉండాలని స్పష్టం చేశారు.

**మున్సిపల్ కమిషనర్‌కు అవార్డు.**

సమాచార హక్కు చట్టం 2005లోని సెక్షన్ 4(1) ప్రకారం సమాచారాన్ని స్వచ్ఛందంగా ప్రజలకు అందుబాటులో ఉంచినందుకు మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ బి. వినోద్ కుమార్కు రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ప్రశంసాపత్రం, అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ పవన్ కుమార్, జిల్లా అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

- విద్యార్థినుల ఆటపాటలతో శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జాతీయ కళామంచ్ సహ కన్వీనర్ మణికంఠ అన్నారు. శంషాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శంషాబాద్ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో కళకళలాడింది. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఆటలాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానానికి, సంస్కృతి సంప్రదాయాలకు, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచులు భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగకు రాష్ట్రంలో ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. వివిధ రకాల పూలను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చడం, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సంబరాలు జరుపుకోవడం తెలంగాణ సంస్కృతిలోని ప్రత్యేకత అని వివరించారు. బతుకమ్మ పండుగ కేవలం వేడుక మాత్రమే కాదని, ప్రకృతిని ఆరాధించడం, పూల ప్రాముఖ్యతను గుర్తించడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యతను చాటిచెప్పే గొప్ప పండుగ అని అన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు మన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ విద్యార్థుల్లో విద్యా సంబంధిత అంశాలతో పాటు సామాజిక బాధ్యత, జాతీయ భావాలు, సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని మణికంఠ తెలిపారు. కళాశాలల్లో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థుల్లో సృజనాత్మకత, పరస్పర సహకారం, ఐక్యతాభావం పెరుగుతాయని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, మన సంప్రదాయాలను పరిరక్షించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర మహిళా సహ కన్వీనర్ మేఘన, జిల్లా కన్వీనర్ పవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్, జిల్లా వసతి గృహాల కన్వీనర్ జశ్వంత్, విద్యార్థి అభివృద్ధి విభాగం కన్వీనర్ నికేతన్, కళామంచ్ కన్వీనర్ రాజకుమారి, నగర సంయుక్త కార్యదర్శులు తరుణ్, వెంకట్, కళాశాల అధ్యక్ష కార్యదర్శులు సర్వజిత్, మౌనిక, పోలీసు శాఖ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అందరూ కలిసి సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎఫ్ఎంజీ హౌస్ సర్జన్ల స్టైపెండ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతిపత్రం



**యాదాద్రిభువనగిరి, విశాల భారతి:** భువనగిరి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ (ఎఫ్ఎంజీ) హౌస్ సర్జన్లు తమ స్టైపెండ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం నెలకు రూ.29,792 స్టైపెండ్ చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.5,000 మాత్రమే ఇస్తామని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్న్‌షిప్ ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు స్టైపెండ్ చెల్లించలేదని తెలిపారు. దీంతో వసతి, నిత్యావసరాలు, వ్యక్తిగత ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం నెలకు రూ.29,792 చొప్పున బకాయిలతో సహా స్టైపెండ్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో క్రమం తప్పకుండా విడుదల చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. వినతిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంజీ ఇంటర్న్స్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్లు భానుప్రసాద్, ప్రణీత్ రాహుల్, జయంత్, నవీన్‌కుమార్, రుషికేష్, సూర్యకిరణ్, మేఘన, ఐశ్వర్య, శ్రీజ, భవిత పాల్గొన్నారు.

# పీఏసీఎస్ శిక్షణ పరీక్షలో బయ్యారం సొసైటీ సిబ్బంది సత్తా

- ప్రథమ బహుమతి సాధించిన స్టాఫ్ అసిస్టెంట్ తుడుం రాజేష్.
- డీసీసీబీ డీజీఎం ఉదయ్ శ్రీ చేతుల మీదుగా పురస్కారం అందజేత.



**బయ్యారం విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** పీఏసీఎస్ ఏఎస్ఎంఎస్‌సీపై మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ అనంతరం నిర్వహించిన పరీక్షలో బయ్యారం సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ తుడుం రాజేష్ ప్రతిభ చాటారు. పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఖమ్మం డీసీసీబీ డీజీఎం ఉదయ్ శ్రీ చేతుల మీదుగా తుడుం రాజేష్ ప్రథమ బహుమతిని అందుకున్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను సమర్థవంతంగా ఆకళింపు చేసుకుని పరీక్షలో మొదటి స్థానంలో నిలవడం పట్ల బయ్యారం సొసైటీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. రాజేష్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

# ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌ను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి



**రాజేంద్రనగర్, విశాల భారతి :** మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న సామ రామ్మోహన్ రెడ్డి శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆయన ఎమ్మెల్యేతో సమావేశమై తన అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సామ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి సహకరించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రుల ఓటర్లకు తన అభ్యర్థిత్వం గురించి తెలియజేసి, వారి మద్దతు లభించేలా సహకరించాలని కోరారు. నియోజకవర్గంలోని పట్టభద్రులందరూ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించేలా తగిన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## రాజేంద్రనగర్‌లో రూ.2.51 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

**భవాని కాలనీ, ప్రేమావతిపేటలో పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్, (విశాల భారతి):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని భవాని కాలనీ, ప్రేమావతి పేట ప్రాంతాల్లో రూ.2.51 కోట్ల వ్యయంతో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. డివిజన్ నంబర్ 120, సర్కిల్ 19 పరిధిలోని పలు అంతర్గత వీధుల్లో ఈ పనులు చేపట్టనున్నారు. కాలనీల్లో రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించడంతో స్థానికంగా మౌలిక సదుపాయాల మెరుగుదలకు అవకాశం కలగనుంది. అంతర్గత రహదారుల నిర్మాణంతో కాలనీవాసులకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వాహనదారులకు ఎదురయ్యే ఇబ్బందులు తగ్గనున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారులపై తలెత్తే సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని స్థానికులు ఆశిస్తున్నారు. కాలనీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరుతున్నారు. రోడ్ల నిర్మాణం పూర్తయితే ఆయా ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు స్థానిక నివాసితులకు ప్రయోజనం చేకూరనుంది. అభివృద్ధి పనుల ద్వారా కాలనీల్లో మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన గ్రాండ్ మాస్టర్ డా.టి.గోపీ కృష్ణకు అభినందనలు




**హైదర్ నగర్, విశాల భారతి :** నిజాంపేట్ రోడ్‌కు చెందిన కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు గ్రాండ్ మాస్టర్ డా. టి. గోపీ కృష్ణ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక రికార్డు ప్రయత్నంలో పాల్గొని తన మార్షల్ ఆర్ట్స్ ప్రతిభను చాటుకున్నారు. 2026 ఏప్రిల్ 26న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ మాస్టర్స్ విభాగంలో కేవలం 20 నిమిషాల్లో 40 సార్లు కరాటే కటాను ప్రదర్శించారు. ఈ అధికారిక రికార్డు ప్రయత్నానికి సంబంధించిన సర్టిఫికెట్, పతకాన్ని సెప్టెంబర్ నాలుగో వారంలో అందుకున్నారు. ఈ సందర్భంగా కెపిహెచ్బి కాలనీ పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్‌ను గ్రాండ్ మాస్టర్ డా. టి. గోపీ కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక ప్రయత్నానికి సంబంధించిన సర్టిఫికెట్, పతకాన్ని సీఐ గారికి చూపించారు. డా. గోపీ కృష్ణ సాధించిన ఈ ఘనతను సీఐ జి. విజయ్ కుమార్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మార్షల్ ఆర్ట్స్ రంగంలో ఆయన చేస్తున్న సేవలు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక రికార్డు ప్రయత్నంలో ఆయన భాగస్వామ్యం యువతకు, మార్షల్ ఆర్ట్స్ అభ్యాసకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని, కఠోర సాధన, పట్టుదల, క్రమశిక్షణతో లక్ష్యాలను చేరుకోవచ్చని ఆయన ప్రయాణం తెలియజేస్తోందని విజయ్ కుమార్ అన్నారు.

## నస్దిక్ సింగారంలో ట్యాంకర్‌తో వరి పంటకు నీరు సరఫరా

- నీరు అందకపోతే వరి పంట దెబ్బతినే అవకాశం ఉంది
- రైతులకు 24 గంటలు కరెంటు సరఫరా చేయాలి
- ప్రభుత్వం వెంటనే స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి
- వార్డ్ మెంబర్ కడారి జంగయ్య యాదవ్






**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** కరెంటు నిరంతరంగా లేకపోవడంతో వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాచారం మండల పరిధిలోని నస్దిక్ సింగారం గ్రామంలో వార్డు మెంబర్ కడారి జంగయ్య తనకున్న వ్యవసాయ పొలంలో వరి పంటను వేశారు. కరెంటు కోతల వల్ల వరి పంట ఎండిపోవడంతో ట్యాంకర్లతో వరి పంటకు నీటిని సరఫరా చేస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కడారి జంగయ్య యాదవ్ మాట్లాడుతూ 24 గంటలు కరెంటు లేకపోవడం ఇచ్చిన కరెంటు లో ఓల్టేజీ తో మోటర్లు సరిగ్గా నడవక పోవడం ఇబ్బందుల పాలవుతున్నారని అన్నారు. వరి పంట కోసం అప్పులు చేసి రైతులు సాగుచేసిన రైతుల పరిస్థితి అధ్వానంగా ఉందని అన్నారు. ప్రస్తుతం వరి పంటలు కీలకమైన దశలో ఉన్నాయని గింజ పట్టే సమయంలో నీరు అందకపోతే పంట పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటలను రక్షించడం ప్రభుత్వం బాధ్యతని, ప్రభుత్వం రైతుల కష్టాన్ని గుర్తించి నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

- బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోషల్ మీడి యాలో తప్పడు ప్రచారం సమంజసం కాదు.
- దమ్ము ధైర్యం ఉంటే నిజమైన రాజకీయం చేయాలి.
- ఆడబిడ్డల మీద రాజకీయం చేయడం సరైన పద్ధతి కాదు. మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి

**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** మల్ రెడ్డి రంగారెడ్డి పై తప్పుడు ప్రచారం చేయొద్దని, దమ్ముంటే నిజమైన రాజకీయం చేయాలని బిఆర్ఎస్ నాయకులను వెదిరే హనుమంత్ రెడ్డి హెచ్చరించారు. మంచాల మండలం కేంద్రంలో మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందో మహిళల స్పందన ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్ లోబస్సు ఎక్కిఇంజాపూర్ వరకు బస్సుప్రయాణం చేశారు. బస్సుఎక్కగానే మహిళలని ఆప్యాయంగా పలకరిస్తూ ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందమ్మా అనిఅడిగి తెలుసుకుంటూ ఒక బిడ్డ లాంటి విద్యార్థిని చెయ్యిపట్టుకొని ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందని అడిగి తెలుసుకుంటున్న సమయంలో కొంతమంది పోకిరీలు వీడియోలు తీసి ఆవీడియోలను తప్పుగా వక్రీకరించి కావాలని మహిళా చెయ్యి పట్టుకున్నాడని విషప్రచారం చేయడం సిగ్గుచేటని అన్నారు. మల్ రెడ్డి రంగారెడ్డి నియోజకవర్గానికి తండ్రి ఒక పెద్దన్న లాంటివాడని అన్నారు. అలాంటి గొప్ప నాయకుడు గొప్ప ఎమ్మెల్యేపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు గత రెండు రోజులుగా విషప్రచారం చేయడం సరైన పద్ధతి కాదు అన్నారు. ఆడపిల్లలు అంటే గౌరవం లేదా బిఆర్ఎస్ పార్టీ నాయకులకని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ప్రతిఒక్క కార్యకర్త నాయకుడు ఎమ్మెల్యే ని ఆప్యాయంగా రంగన్న అన్న అని ప్రేమతో పలకరి స్తూఉంటారు అలాంటి గొప్ప నాయకుడు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. అదే మీ బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డిని మీపార్టీ నాయకులు ఎవరైనా అన్న అనిపిలిస్తే ఆగ్రహంతో చూస్తాడు మీనాయకుడికి మానాయకుడికి ఉన్నతేడా ఏమిటో తెలుసుకోవాలని అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకనే ఇలాంటి విషప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఒక నియోజకవర్గా నికి ప్రజాప్రతినిధి ఎమ్మెల్యే ప్రతి సమస్య తెలుసుకునే హక్కుఎమ్మెల్యేకు ఉంటుంది ఆహక్కుతో నే మహిళలను కలిసి సమస్యలు తెలుసుకున్నాడు తెలుసుకోవడం తప్ప అని అన్నారు. దమ్ము ధైర్యం ఉంటే నిజమైన రాజకీయం చేయాలి విమర్శలకు ప్రతివిమర్శ చేసుకోవాలి గానీ ఒకఆడ పిల్లను అడ్డం పెట్టుకొని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. సొంత బంధువులైన ఆడపిల్లలని గౌరవించని సంస్కృతి బిఆర్ఎస్ పార్టీ నాయకులది మహిళలతో పేకాట ఆడుతూ అడ్డంగా దొరికిన సంస్కృతి బిఆర్ఎస్ పార్టీ నాయకులదని అన్నారు.

# వరి పంటలను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలి
- బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్
- నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే విద్యుత్ సబ్‌స్టేషన్ల ముట్టడి: బీజేపీ హెచ్చరిక

**విశాల భారతి, షాద్ నగర్**



రైతుల విజ్ఞప్తి మేరకు కేశంపేట మండలంలోని కొత్తపేట,సంతపూర్, నిర్దేవెల్లి గ్రామాల్లో వరి పంటలను బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి గారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వరి పంటల దుస్థితిని పరిశీలించగా అనేక ఆందోళనకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.ప్రస్తుతం వరి పంటలు కీలకమైన దశలో ఉన్నాయని,గింజ గట్టి పడే సమయంలో నీరు అందకపోతే పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.తాము పరిశీలించిన సుమారు 100 ఎకరాల వరి పంటలో దాదాపు 50 ఎకరాలకు మాత్రమే కొంతమేర నీరు అందుబాటులో ఉందని, మిగిలిన 50 ఎకరాల్లో నీటి కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. అందులో సుమారు 15 ఎకరాల పంట ఇప్పటికే ఎండిపోయే దశకు చేరుకుందని పేర్కొన్నారు. ఇదే పరిస్థితి మరో 15 నుంచి 20 రోజుల పాటు కొనసాగితే రైతులు పూర్తిస్థాయిలో పంట నష్టపోయే ప్రమాదం ఉందని, అప్పులు చేసి సాగు చేసిన రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

**కరెంట్ నిరంతరాయంగా లేకపోవడంతో ఇబ్బందులు**

రైతులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువస్తూ, వ్యవసాయానికి కేటాయించిన విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. విద్యుత్ ఒక గంటకు ఒకసారి నిలిచిపోవడం, తిరిగి సరఫరా అయ్యేలోపు మోటార్ల ద్వారా నీరు సక్రమంగా పారకపోవడం వల్ల పొలాలకు తగినంత నీరు అందడం లేదని వాపోయారు. తక్కువ వోల్టేజీ సమస్యలు కూడా ఇబ్బందులకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం కేటాయిస్తున్న విద్యుత్ గంటలలోనైనా నిరంతరాయంగా, తగిన వోల్టేజీతో సరఫరా చేస్తే తమ పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని రైతులు విజ్ఞప్తి చేశారు.

**పరిశ్రమలకు కొంతసేపు విద్యుత్ తగ్గించి రైతులకు అందించాలి**

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి గారు మాట్లాడుతూ, షాద్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న పరిశ్రమలకు తాత్కాలికంగా కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరాను తగ్గించి, ఆ విద్యుత్‌ను వ్యవసాయ అవసరాలకు మళ్లించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ నిర్వహణతో పాటు రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు.రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులు కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్ సమస్యలతో నష్టపోవడం బాధాకరమని, అన్నదాతల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని డిమాండ్ చేశారు.

**నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే సబ్‌స్టేషన్ల ముట్టడి**

రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, రాష్ట్రప్రభుత్వం తక్షణమే స్పందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మరో నాలుగు రోజుల్లో విద్యుత్ సరఫరా సమస్యకు పరిష్కారం చూపకపోతే షాద్‌నగర్ నియోజకవర్గంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లను ముట్టడించి రైతుల పక్షాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు ఎండిపోతున్న వరి పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. రైతుల పంటలను రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, అన్నదాతలకు న్యాయం జరిగే వరకు బీజేపీ రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భారతీయ జనతా పార్టీ షాద్ నగర్ నియోజకవర్గం ధార్మిక సెల్ కన్వీనర్ పసుల నరసింహ యాదవ్, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్, సీనియర్ నాయకులు కరెడ్ల నరేందర్ రెడ్డి, సిల్వర్ లింగయ్య, వేణుగోపాల్, ఆకుల గోపాల్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీకాంత్, సాయి, సత్యం, మహాలింగం, అమర్నాథ్ రెడ్డి, దామోదర్ రెడ్డి,మురళి, శ్రీశైలం, హరికృష్ణ, బీరస్వామి, ఎల్లయ్యా, కుమ్మరి వెంకటేష్, యాదగిరి, శేఖర్ రెడ్డి,కృష్ణయ్య,లింగయ్య,సత్యనారాయణ, శేఖర్,మరియు రైతులు పాల్గొన్నారు..

## రాజేంద్రనగర్‌లో తాగునీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరించాలి

**జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకుల వినతి**

**రాజేంద్రనగర్,విశాల భారతి :**



రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్షాకోట్, బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్ డివిజన్లలో నెలకొన్న తీవ్ర తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజ్ మాట్లాడుతూ, ఆయా డివిజన్ల పరిధిలోని పలు కాలనీల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారంలో ఎప్పుడు నీటి సరఫరా జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని, దీంతో ప్రజలు తాగునీటి అవసరాల కోసం అనేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి కనీసం రెండు రోజులకు ఒకసారైనా క్రమం తప్పకుండా నీటి సరఫరా జరిగేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కోరారు. వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటిపోవడం వల్ల నీటి సమస్య మరింత తీవ్రమైందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి వి. రాముడు యాదవ్ మాట్లాడుతూ, పలు ప్రాంతాల్లో పైపులైన్లు పగిలిపోయినా, నీటి సరఫరా చేసే మోటార్లు మరమ్మతులకు గురైనా అధికారులు సకాలంలో స్పందించడం లేదని ఆరోపించారు. దీంతో నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రత్యామ్నాయ మోటార్లను అందుబాటులో ఉంచడంతో పాటు, నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ నీటి ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. పైపులైన్ల మరమ్మతులను వెంటనే చేపట్టి నీటి సరఫరాను క్రమబద్ధీకరించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు అందజేసిన వినతి పత్రంపై జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. త్వరలోనే సంబంధిత అధికారులు ఆయా కాలనీల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో నీటి సమస్యలను పరిశీలిస్తారని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాజేంద్రనగర్ పరిధిలోని ప్రజల తాగునీటి కష్టాలను దృష్టిలో ఉంచుకొని జలమండలి అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని, నీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శాంతి కుమార్, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పై తప్పుడు ప్రచారం మానుకోవాలి

- దమ్ము ధైర్యం ఉంటే నిజమైన రాజకీయం చేయాలి
- ఆడబిడ్డల మీద రాజకీయం చేయడం సరైన పద్ధతి కాదు
- యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**



మల్ రెడ్డి రంగారెడ్డి పై తప్పుడు ప్రచారం చేయొద్దని, దమ్ముంటే నిజమైన రాజకీయం చేయాలని బిఆర్ఎస్ నాయకులను యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. యాచారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందో మహిళల స్పందన ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్ లోబస్సు ఎక్కిఇంజాపూర్ వరకు బస్సుప్రయాణం చేశారు. బస్సుఎక్కగానే మహిళలని ఆప్యాయంగా పలకరిస్తూ ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందమ్మా అనిఅడిగి తెలుసుకుంటూ ఒక బిడ్డ లాంటి విద్యార్థిని చెయ్యిపట్టుకొని ఉచిత బస్సు ప్రయాణం ఎలాఉందని అడిగి తెలుసుకుంటున్న సమయంలో కొంతమంది పోకిరీలు వీడియోలు తీసి ఆవీడియోలను తప్పుగా వక్రీకరించి కావాలని మహిళా చెయ్యి పట్టుకున్నాడని విషప్రచారం చేయడం సిగ్గుచేటని అన్నారు. మల్ రెడ్డి రంగారెడ్డి నియోజకవర్గానికి తండ్రి ఒక పెద్దన్న లాంటివాడని అన్నారు. అలాంటి గొప్ప నాయకుడు గొప్ప ఎమ్మెల్యేపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు గత రెండు రోజులుగా విషప్రచారం చేయడం సరైన పద్ధతి కాదు అన్నారు. ఆడపిల్లలు అంటే గౌరవం లేదా బిఆర్ఎస్ పార్టీ నాయకులకని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ప్రతిఒక్క కార్యకర్త నాయకుడు ఎమ్మెల్యేని ఆప్యాయంగా రంగన్న అన్న అని ప్రేమతో పలకరి స్తూఉంటారు అలాంటి గొప్ప నాయకుడు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. అదే మీ బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డిని మీపార్టీ నాయకులు ఎవరైనా అన్న అనిపిలిస్తే ఆగ్రహంతో చూస్తాడు మీనాయకుడికి మానాయకుడికి ఉన్న తేడా ఏమిటో తెలుసు కోవాలని అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకనే ఇలాంటి విషప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఒక నియోజకవర్గా నికి ప్రజాప్రతినిధి ఎమ్మెల్యే ప్రతి సమస్య తెలుసుకునే హక్కు ఎమ్మెల్యేకు ఉంటుంది ఆహక్కుతో నే మహిళలను కలిసి సమస్యలు తెలుసుకున్నాడు తెలుసుకోవడం తప్ప అని అన్నారు. దమ్ము ధైర్యం ఉంటే నిజమైన రాజకీయం చేయాలి విమర్శలకు ప్రతివిమర్శ చేసుకోవాలి గానీ ఒకఆడ పిల్లను అడ్డం పెట్టుకొని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు.

## ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం 'బాణం' గుర్తుకే ఓటు వేయాలి!

- మొగుళ్ల రాజిరెడ్డిని గెలిపించండి.. ఆర్టీసీ పరిరక్షణకు కార్మికులంతా ఐక్యంగా నిలవాలి
- హయత్‌నగర్-1, 2 డిపోల్లో ఎన్నికల సరళిని పరిశీలించిన చిలుక మధుసూదన్‌రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణ ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, సంస్థ భవిష్యత్తు కోసం గుర్తింపు సంఘం ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి తెలంగాణ వర్కర్స్ యూనియన్ (TWU) అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ల రాజిరెడ్డిని గెలిపించాలని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, హయత్‌నగర్ 1, 2 డిపోల గౌరవ అధ్యక్షుడు చిలుక మధుసూదన్‌రెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. అక్టోబర్ 9న హయత్‌నగర్ 1, 2 ఆర్టీసీ డిపోల్లో నిర్వహించిన గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా ఆయన డిపోల వద్ద ఎన్నికల సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడి, వారి హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. టీఎంయూ, ఐఎన్‌టీయూసీ, ఎస్‌డబ్ల్యూయూ తదితర సంఘాలు బలపరిచిన TWU అభ్యర్థి మొగుళ్ల రాజిరెడ్డికి బాణం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

**ఆర్టీసీ విలీనం.. వేతన సవరణే ప్రధాన లక్ష్యం**

ఆర్టీసీని ప్రభుత్వ రంగంలో విలీనం చేయడం, ఉద్యోగులకు వేతన సవరణ అమలు చేయడం, కార్మికులకు భద్రత కల్పించడం, సీసీఎస్ బకాయిలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించడం ప్రధాన లక్ష్యాలని చిలుక మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ లక్ష్యాల సాధనకు కార్మికులంతా ఐక్యంగా నిలిచి బాణం గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

**కార్మికుల ఐక్యతతో ఆర్టీసీకి బలం**

ఆర్టీసీ సంస్థను పరిరక్షించుకోవడంతో పాటు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు కార్మికుల ఐక్యత ఎంతో అవసరమని ఆయన అన్నారు. కార్మికుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మొగుళ్ల రాజిరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులు అండగా నిలవాలని, సంస్థ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేయాలని కోరారు. బాణం గుర్తుకు ఓటు వేద్దాం.. తెలంగాణ ఆర్టీసీని పరిరక్షించుకుందాం.. కార్మికుల హక్కులను సాధించుకుందాం అనే నినాదంతో కార్మికులు ముందుకు రావాలని చిలుక మధుసూదన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## పోలీసు విధుల్లో వృత్తి నైపుణ్యం ఎంతో కీలకం

**112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలకు సైబరాబాద్ కమిషనర్ డాక్టర్ రమేష్ రెడ్డి దిశానిర్దేశం**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** పోలీసు శాఖలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చట్టాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, వృత్తి నైపుణ్యంతో విధులు నిర్వహించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్ రెడ్డి ప్రొబేషనరీ డీఎస్పీలకు సూచించారు. ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి, పోలీసు విధులు, బాధ్యతలు, క్షేత్రస్థాయి అనుభవాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. శిక్షణ పూర్తయిన అనంతరం జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రాయోగిక శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీసు శాఖలోని వివిధ విభాగాల పనితీరు, వాటి విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, డివిజనల్ అధికారిగా బాధ్యతలు నిర్వహించే సమయంలో పాటించాల్సిన విధానాలను వివరించారు. పోలీసు అధికారులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. సుమారు 35 ఏళ్లపాటు సాగే పోలీసు సేవలో అనేక సవాళ్లు ఎదురవుతాయని, వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు నిరంతరం జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండటంతోపాటు, మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా విధులను నిర్వహించాలని తెలిపారు. తన సుదీర్ఘ ప్రాయోగిక పోలీసింగ్ అనుభవాలను శిక్షణాధికారులతో పంచుకున్న డాక్టర్ రమేష్ రెడ్డి, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే విధానాలను వివరించారు. విధుల నిర్వహణలో ఎదురయ్యే సందేహాలను అడిగి తెలుసుకునేలా ప్రోత్సహించి, శిక్షణాధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. పోలీసు సేవలో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన వ్యవహారం, వృత్తిపరమైన నైపుణ్యం కీలకమని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డైరెక్టర్ వేమా శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ వి. భాస్కర్‌తో

## ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం అందించాలి

- పేద ప్రజలకు సేవా భావంతో వైద్యం అందించాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రి ప్రారంభించిన మంత్రి
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** తూర్కయంజాల్ బ్రాహ్మణపల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రినీ తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాలు సినిమాటోగ్రాఫి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటెలా రాజేందర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, దేవరకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే బాలు నాయక్, అచ్చంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, రోడ్ల కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ఎమ్మెల్సీ ఎలిగంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్, డిజి నర్సింహా రావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి లు పాల్గొని ఆసుపత్రిలోని వివిధ విభాగాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించే లక్ష్యంతో తూర్కయంజాల్ లో 'తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రినీ ఘనంగా ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించి లాభాపేక్షతో కాకుండా సేవా గుణంతో ప్రజలకు వైద్యం చేయాలనీ సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం, దేవరకొండ, కల్వకుర్తి, మునుగోడు, అచ్చంపేట నియోజకవర్గాల ప్రజలకు మా ఆసుపత్రి అందుబాటులో ఉంటుందనీ చెప్పారు. "సామాన్య ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన వైద్యం అందించడమే మా ప్రధాన లక్ష్యం. తార మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించి, ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తాము" అని తెలిపారు. ఈ ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, కార్డియాలజీ, జనరల్ సర్జరీ, అనేస్తాషియా వంటి అన్ని ప్రధాన విభాగాలు అందుబాటులో ఉంటాయి. అనుభవజ్ఞులైన డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది మరియు అత్యాధునిక పరికరాలతో 24/7 అత్యవసర సేవలు, ల్యాబ్, ఫార్మసీ,సిటీ స్కాన్, ఇన్‌పేషెంట్ సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం డాక్టర్లు తరుణ్ తెజ్, సంతోష్ వర్మ, ఐశ్వర్య, లక్ష్మణ్ రెడ్డి, శ్రవణ్ కుమార్, మాలోత్ రాజు, సుధాకర్ రెడ్డి, లహరీ తిరుణగారి, అలేఖ్య రెడ్డి, శృతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓయూలో బతుకమ్మ సంబరాలు



**ముషీరాబాద్,విశాల భారతి:** ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎన్ ఎస్ యు ఐ మేడ శీను ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం రాత్రి జరిగిన బతుకమ్మ వేడుకలకు మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, సీనియర్ నాయకురాలు ఇందిరా శోభన్ తదితరులు హాజరై బతుకమ్మలు పేర్చి బతుకమ్మ పాటలతో ఆడి పాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి పండుగ బతుకమ్మ పండుగ అని ప్రపంచంలో పకృతితో ముడిపడి ఉన్న పండుగ బతుకమ్మ ఒక్కటే అని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మేడా శ్రీను అభినందించారు.

## తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ

**బతుకమ్మ సంబరాలతో సందడి పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ నందివనపర్తి**




**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ నందివనపర్తి పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో పూలతో అందంగా బతుకమ్మను అలంకరించి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మ చుట్టూ చేరి సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ పండుగల విశిష్టతను, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి పట్ల గౌరవభావాన్ని పెంపొందించడం, సంప్రదాయ పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పాఠశాల ప్రాంగణం బతుకమ్మ వేడుకలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ నందివనపర్తి పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## కట్ క్లిప్‌లతో దుష్ప్రచారం..
## పూర్తి వీడియోతో వాస్తవాలు వెలుగులోకి!

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటనపై తప్పడు ప్రచారం తగదు
- రాజకీయ లబ్ధి కోసం ప్రజాసేవను వక్రీకరించొద్దు..

**మాజీ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ గౌస్ పాషా**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటనపై సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న వక్రీకృత ప్రచారాన్ని అబ్దుల్లాపూర్‌మెట్ మాజీ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ గౌస్ పాషా తీవ్రంగా ఖండించారు. పూర్తి వీడియోను పక్కనపెట్టి, కొన్ని సెకన్ల దృశ్యాలను మాత్రమే కట్ చేసి అసత్య ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని ఆయన పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే మహాలక్ష్మి పథకం అమలుతీరును క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారని గౌస్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులతో మాట్లాడి పథకం అమలుపై వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ప్రజా సమస్యల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

**పూర్తి వీడియో చూడకుండా విమర్శలు చేయడం సరికాదు**

కదులుతున్న బస్సులోని కొన్ని క్షణాల దృశ్యాలను మాత్రమే తీసుకుని, వాటికి వక్రీకృత అర్థాలు ఆపాదిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేయడం తగదని గౌస్ పాషా అన్నారు. ఏదైనా సంఘటనపై అభిప్రాయం వ్యక్తం చేసే ముందు దాని పూర్తి నేపథ్యాన్ని, సందర్భాన్ని పరిశీలించాలని సూచించారు. పూర్తి వీడియోను చూస్తే ఎమ్మెల్యే పర్యటన వెనుక ఉన్న ఉద్దేశం, అక్కడ చోటుచేసుకున్న పరిణామాలు అర్థమవుతాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రజల మధ్యకు వెళ్లే నాయకులపై రాజకీయ విమర్శలు చేయడం సహజమేనని, అయితే మహిళలు, విద్యార్థులకు సంబంధించిన అంశాలను రాజకీయ వివాదాలకు వాడుకోవడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత అంశాలను వివాదాస్పదం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

**ప్రజాసేవను దుష్ప్రచారంతో అడ్డుకోలేరు**

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రతి వీడియోనూ వాస్తవమని నమ్మకుండా, దాని పూర్తి వివరాలను తెలుసుకున్న తర్వాతే స్పందించాలని గౌస్ పాషా ప్రజలకు సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం వాస్తవాలను వక్రీకరించడం వల్ల ప్రజల్లో అపోహలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కట్ చేసిన వీడియోలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరు. పూర్తి వీడియోను పరిశీలిస్తే అసలు విషయం ఏమిటో స్పష్టమవుతుంది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించే నాయకులపై విమర్శలు చేయడం కంటే, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడంపై దృష్టి పెట్టాలి అని మహమ్మద్ గౌస్ పాషా పేర్కొన్నారు. రాజకీయ విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ వాస్తవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు.

# ఆటోనగర్ డంపింగ్ యార్డుపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన

- దుర్వాసనలు, మురుగునీటితో 20 కాలనీల ప్రజల అవస్థలు
- త్వరలో సమస్యల పరిష్కారానికి చర్యలు
- కాలనీ వాసులతో సమావేశం.. కాలుష్య నియంత్రణ మండలి అధికారితో కలిసి పరిస్థితుల పరిశీలన



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆటోనగర్ డంపింగ్ యార్డ్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సుమారు 20 కాలనీల ప్రజలకు సమస్యల నుంచి ఉపశమనం కల్పించేందుకు ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. శుక్రవారం ఉదయం కాలుష్య నియంత్రణ మండలి అధికారి వెంకట నర్సయ్యతో కలిసి డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, ప్రభావిత కాలనీల నివాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**దుర్వాసనలు, మురుగునీటితో ప్రజలకు ఇక్కట్లు**

ఆటోనగర్ డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసనలు, ట్రంక్ లైన్లలో కలుస్తున్న మురుగు నీరు, రసాయనాలతో కూడిన నీటి ప్రవాహం, రహదారులపై పడేస్తున్న చెత్తాచెదారం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలతో పరిసర ప్రాంతాల్లో నివసించడం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

**గతంలో అభివృద్ధి చేశాం..**
**మళ్లీ సమస్యలు ఎందుకొచ్చాయి ?**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, చెత్త వేయకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. నీటిని తరలించేందుకు అనేక ట్యాంకర్లను వినియోగించడంతో పాటు నీటి శుద్ధి కోసం ఎస్టీపీ ఏర్పాటు చేశామని, ట్రంక్ లైన్ నిర్మాణానికి సుమారు రూ.7 కోట్ల నిధులు మంజూరు చేయించామని వివరించారు. గతంలో అభివృద్ధి చేసిన ఈ ప్రాంతంలో కాలనీ వాసులు ప్రశాంతంగా వాకింగ్ చేసుకునే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. అయితే, స్థానిక పాలకుల నిర్లక్ష్యం కారణంగా గతంలో చేపట్టిన చర్యలు కొనసాగకపోవడంతో సమస్యలు మళ్లీ మొదటికొచ్చాయని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు తాము కృషి చేస్తుంటే, కొందరు రాజకీయ ప్రత్యర్థులు వ్యక్తిగత రాజకీయ లబ్ధి కోసం తనపై విమర్శలు చేయడం సరికాదన్నారు.

**విమర్శలు కాదు.. సమస్య పరిష్కారానికి ముందుకు రావాలి**

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాల్సిన సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించడం సమంజసం కాదని సుధీర్‌రెడ్డి అన్నారు. విమర్శలు చేసే వారు చేతనైతే సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని సూచించారు. రాజకీయ ప్రత్యర్థులు తప్పుడు విమర్శలు మాని, డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే ప్రయత్నాల్లో భాగస్వాములు కావాలని, అలా ముందుకు వస్తే స్వాగతిస్తానని పేర్కొన్నారు. అధికారులతో మాట్లాడి కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డ్ సమస్యపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, టంగుటూరి నాగరాజు, జగదీష్ యాదవ్, సంతోష్ గుప్తా, రవి, బాలరాజుతో పాటు డంపింగ్ యార్డ్ ప్రభావిత కాలనీల అధ్యక్షులు అంజయ్య గౌడ్, గోపికృష్ణరెడ్డి, రమేష్, రవి, విజయ, ప్రభాకర్, సాంబిరెడ్డి, రాజేష్, రంగారెడ్డి, వాసు యాదవ్, గాలయ్య, భాస్కర్, మహేష్ పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాలను జల సమాధి చేస్తే ఊరుకోం

- తెలంగాణ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్

**భద్రాచలం: విశాల భారతి;**




తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ముందర పోలవరం ప్రాజెక్ట్ కొరకు షెడ్యూల్డ్ ప్రాంతాలైనటువంటి ఏజెన్సీ గ్రామాలను మండలాలను జలగర్భం లోకి ముంచి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ సాగుతుంది. ఈరోజు విద్యార్థి జేఏసి ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుంది ఏమిటంటే ఎలాగో ముంపు మండలాలు పోలవరం ప్రాజెక్టుపై తమ ఉనికిని, తమ తరతరాల జీవన విధానాన్ని బతుకు తెరువుని జలగర్భంలో కలిపి చింతూరు రంపచోడవరం కొన్ని మునగని ప్రాంతాల వైపు వలసలకు వచ్చే పరిస్థితి ఉంది ఇలాంటి సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏజెన్సీకి ఒక వరం లా జిల్లా ప్రకటన చేసింది అది ఏజెన్సీ జిల్లాగా రూపొందించాలని, గడ్డం శ్రీరామ్ పేర్కొన్నారు. అంతేకాకుండా పేరుకే జిల్లాల కాకుండా జిల్లా కార్యాలయానికి సంబంధించి హెడ్ కోటర్స్, సౌకర్యాలు ముఖ్యంగా జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలి. ఇది ప్రతి జిల్లాకి ఉండేటటువంటి ప్రధానమైనటువంటి అర్హత రంపచోడవరంలో జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలని, చింతూరు ప్రాంతంలో మరొక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏర్పాటు చేయాలని దీని ద్వారా ఏజెన్సీ లో ఉన్నటువంటి అన్ని సమస్యలను, సత్వరంగా ఉనికిని కోల్పోయి ఉన్నవారు ఏదైనా సమస్య ఉంటే కోర్టుపరంగా పరిష్కరించుకోవడానికి మార్గాన్ని సుగమం చేయాలి విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు విజ్ఞప్తి చేస్తున్నారు, జనాభాతో సంబంధం లేకుండా రంపచోడవరంలో జిల్లా మెజిస్ట్రేట్ కోర్ట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని, తద్వారా అన్ని కోల్పోయిన వారు చింతూరు రంపచోడవరంలో, వారికి ఉన్నటువంటి కేసులను పరిష్కరించుకొని, జలగర్భంలో కోల్పోయిన వాళ్ళ ఉనికి మరొక కొత్త జిల్లాలో కొత్త జీవితాన్ని ప్రారంభించి బ్రతికే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకొని, రంపచోడవరం జిల్లా కేంద్రంలో జిల్లా కోర్టును చింతూరులో జే ఎఫ్ సి ఎం కోర్టును ఏర్పాటు చేయాలని, తద్వారా ముంపు మండలాలకు సంబంధించిన వారందరికీ కూడా వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు ఒక పాస్టర్ కోర్టులు ఏర్పాటు చేసినట్లు అవుతుంది. అని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్ విలీన మండలాలతో ఉన్న అనుబంధం రీత్యా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, విజ్ఞప్తి చేస్తున్నారనీ ఆయన అన్నారు.

## కాన్షీరామ్ స్ఫూర్తితో బహుజన రాజ్యమే లక్ష్యం




- అణగారిన వర్గాలకు రాజకీయ అధికారం సాధించడమే బీఎస్పీ లక్ష్యం
- పూలే, అంబేడ్కర్ ఆశయాలను దేశవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన యోధుడు కాన్షీరామ్
- తెలంగాణలో బహుజన రాజ్యం సాధించడం తథ్యం
- బీఎస్పీ రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్.**

అణగారిన వర్గాలకు రాజకీయ అధికారం దక్కే వరకు పోరాటం కొనసాగుతుందని, కాన్షీరామ్ చూపిన మార్గంలో తెలంగాణలో బహుజన రాజ్యాన్ని సాధించడం తథ్యమని బీఎస్పీ రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్ అన్నారు. బీఎస్పీ మహబూబాబాద్ అసెంబ్లీ యూనిట్ అధ్యక్షుడు గూగులోతు నరేష్ అధ్యక్షతన కాన్షీరామ్ 20వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దార్ల శివరాజ్ మాట్లాడుతూ.. ఉన్నత ఉద్యోగాన్ని సైతం త్యజించి, దాదాపు 40 సంవత్సరాల పాటు కుటుంబానికి దూరంగా ఉంటూ దేశవ్యాప్తంగా సైకిల్‌పై పర్యటించిన కాన్షీరామ్.. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను బహుజన సమాజంలోకి తీసుకెళ్లారని తెలిపారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పర్యటించి అణగారిన వర్గాలను చైతన్యపరిచి, వారిలో రాజకీయ చైతన్యాన్ని రగిలించిన మహోన్నత ఉద్యమకారుడు కాన్షీరామ్ అని కొనియాడారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో అణగారిన వర్గాలకు చెందిన మాయావతిని నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా చేయడంలో కాన్షీరామ్ నిర్మించిన ఉద్యమం కీలక పాత్ర పోషించిందన్నారు. రాజకీయ అధికారం ద్వారానే బహుజన వర్గాల సామాజిక, ఆర్థిక సాధికారత సాధ్యమని కాన్షీరామ్ నమ్మారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని తెలంగాణలో ముందుకు తీసుకెళ్లి బహుజన రాజ్యాన్ని సాధించడమే తమ లక్ష్యమని శివరాజ్ స్పష్టం చేశారు.

**ఘనంగా నివాళులు.**

కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా ముందుగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదుట ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాన్షీరామ్ చేసిన సామాజిక, రాజకీయ పోరాటాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకులు ధార ప్రసాద్‌రావు, ఇసంపెల్లి ఉపేందర్, ఏవైఎస్ నాయకులు తప్పెట్ల వీరన్న, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు బోడ లక్ష్మణ్, కేవీపీఎస్ నాయకులు నాగెల్లి సురేష్, పిల్లి రవి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ టౌన్షిప్‌లో పార్కు స్థలాన్ని పరిరక్షించాలి

- ప్రముఖ్ టౌన్షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు




**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని ప్రముఖ్ టౌన్షిప్‌లో పార్కు స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ ప్రముఖ్ టౌన్షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. టౌన్షిప్‌లో సుమారు 3 ఎకరాల 14 గుంటల విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలాన్ని పరిరక్షించి, అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు హైడ్రా అధికారులను కోరారు.ఈ ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా సీఐ సైదులు పార్కు స్థలాన్ని స్వయంగా పరిశీలించి, సర్వే నిర్వహించారు. అనంతరం హైడ్రా సిబ్బందితో కలిసి పార్కు స్థలంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. పార్కు స్థలం అన్యాక్రాంతం కాకుండా హైడ్రా అధికారులు చర్యలు చేపట్టడంతో టౌన్షిప్ వాసులు హర్షం వ్యక్తం చేశారు. పార్కు స్థల పరిరక్షణకు స్పందించి తక్షణ చర్యలు చేపట్టిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ , సీఐ సైదులు లకు ప్రముఖ్ టౌన్షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ్ టౌన్షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీ మల్లారెడ్డి, ఉదయశ్రీ, గున్రెడ్డి రమణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రామ్ రెడ్డి, నవీన్ కుమార్ , సురేందర్ రెడ్డి, చెన్నారెడ్డి, రఘురామయ్య, ఇతర కార్యవర్గ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మైనర్‌పై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష!

- నాగోల్ పోక్సో కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పు
- రూ.17 వేల జరిమానా, బాధితురాలికి రూ.2 లక్షల పరిహారం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** మైనర్ బాలికపై లైంగిక దాడికి సంబంధించిన పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్‌లోని ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం తీర్పునిచ్చింది. నిందితుడికి రూ.17 వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.2 లక్షల పరిహారం మంజూరు చేసినట్లు నాగోల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

**2020లో నమోదైన కేసులో తీర్పు**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో క్రైమ్ నంబర్ 1173/2020గా ఈ కేసు నమోదైంది. ఈ కేసులో గుంజి కోటేశ్వరరావు (28) నిందితుడిగా ఉన్నాడు. భారతీయ శిక్షాస్మృతిలోని 366, 376(2)(ఎన్), 342, 493, 506 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(ఎల్) రెడ్‌విత్ 6 కింద కేసు నమోదు చేశారు. కేసు ఎస్‌సీ నంబర్ 409/2021గా న్యాయస్థానంలో విచారణకు వచ్చింది. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్‌లోని అత్యాచారం, పోక్సో కేసుల విచారణకు సంబంధించిన ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం 2026 అక్టోబర్ 9న నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అదనంగా రూ.17 వేల జరిమానా విధించి, బాధితురాలికి రూ.2 లక్షల పరిహారం అందించాలని ఆదేశించింది.

**దర్యాప్తు, విచారణలో పోలీసుల సహకారం**

ఈ కేసు దర్యాప్తును అప్పట్లో ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన వి. అశోక్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఏసీపీగా పనిచేసిన పి. శ్రీధర్‌రెడ్డి చేపట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు డి. రఘు, పి. సత్యనారాయణ, కృష్ణ ప్రసన్న న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. కేసు విచారణ ప్రక్రియలో సంబంధిత పోలీసు సిబ్బంది, పర్యవేక్షణ అధికారులు సహకరించారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ పోక్సో కేసులో న్యాయస్థానం తీర్పు వెలువరించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పై దుష్ప్రచారాలు మానుకోవాలి

**యాచారం మండలం మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బస్సులో ప్రయాణిస్తూ ప్రజలతో మాట్లాడిన దృశ్యాలను కొంతమంది వక్రీకరించి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్ ఆరోపించారు. అక్టోబర్ 6న కలెక్టరేట్ కార్యక్రమం అనంతరం బొంగ్లూర్ గేటు వద్ద ప్రయాణికుల కష్టసుఖాలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే ఆర్టీసీ బస్సులో ప్రయాణించారని తెలిపారు. బస్సులో తన కూతురు తో సమానం గల యువతితో మాట్లాడిన దృశ్యాలను వక్రీకరించి ట్రోలింగ్ చేయడం సరికాదన్నారు. రాజకీయ విమర్శలకు అంశాలు లేకపోవడంతోనే ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను మానుకోవాలని గజ్జి రామకృష్ణ యాదవ్ హెచ్చరించారు..మీరు ఏదైనా అభివృద్ధి గురించి మాట్లాడాలి ప్రజలకు ఉపయోగం జరిగేలా మాట్లాడాలి అంతే గాని ఏలాంటి మచ్చలేని మా నాయకుని పైన దురుప్రచారం చేస్తే ఊరుకునేది లేదు నియోజకవర్గం లో కూడా తిరుగకుండా ప్రజలే మీకు బుద్ధి చెప్తారు అని గజ్జి రామకృష్ణ యాదవ్ బిఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు.

# పేదోడి గుడిసెపై కబ్జా కన్ను

- పేదోడి గుడిసెపైనే కన్నా!?
- యాభై ఏళ్ల నివాసాన్ని కబళించేందుకు యత్నమా!?
- ఇంటిపన్ను రసీదు, కరెంట్ బిల్లులు, మిషన్ భగీరథ కనెక్షన్ ఉన్నా న్యాయం కోసం ఎదురుచూపులు!
- కులవృత్తితో బతికే కుటుంబాన్నే వీధిన పడేస్తారా
- సామాజిక న్యాయం ఎక్కడ!?
- ప్రజా సంఘాలు స్పందించాలి.. న్యాయ విచారణ జరిపించాలి!
- "ఎరుకుల సంఘం" నాయకులు ఏమైనట్లు? వారి గొంతు ఎందుకు మూగబోయింది?
- ఉన్న గుడిసెను కూడా కాపాడుకోలేని దుస్థితి..
- ఇదేనా సామాజిక న్యాయం!?
- గుడిసె కూల్చే ప్రయత్నాలపై అధికారుల మౌనం ఎందుకు
- తక్షణ విచారణకు డిమాండ్.
- ('బాధితుడి ఆక్రందన' ప్రత్యేక కథనం).

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.**

ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. పేదల సంక్షేమం పేరుతో అనేక పథకాలు అమలవుతున్నాయి. అయినప్పటికీ కొందరు నిరుపేదల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు కనిపించడం లేదు. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న గుడిసెను కాపాడుకోవడానికి కూడా పోరాడాల్సిన పరిస్థితి ఎదురైతే, పేదవాడి పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన ఎరుకల కులానికి చెందిన నిరుపేద నిమ్మశెట్టి వెంకన్న కుటుంబం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్య ఇదే. గత 50 ఏళ్లుగా తమ కుటుంబం నివాసం ఉంటున్న ఇంటి స్థలాన్ని కొందరు తమదిగా పేర్కొంటూ, గుడిసెను ధ్వంసం చేసి స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని బాధితుడు ఆరోపిస్తున్నాడు.



**ఆధారాలున్నా.. అభద్రతలోనే జీవనం!**

నిమ్మశెట్టి వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. తమ తండ్రి నివాసం ఉన్న ఇంటి స్థలంలోనే తాము గత 50 ఏళ్లుగా నివసిస్తున్నామని చెబుతున్నాడు. తమ కుటుంబం నివాసానికి సంబంధించి కురవి మేజర్ గ్రామ పంచాయతీ జారీ చేసిన ఇంటిపన్ను రసీదు ఉందని, విద్యుత్ బిల్లులు కూడా ఉన్నాయని పేర్కొన్నాడు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మిషన్ భగీరథ పథకం ద్వారా తమ ఇంటికి నీటి పైపులైన్ కనెక్షన్ కూడా ఉందని వెల్లడించాడు. ఇన్ని ఆధారాలు ఉన్నప్పటికీ కొందరు వ్యక్తులు ఇంటి స్థలం తమదంటూ గుడిసెను ధ్వంసం చేసి స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అయితే, ఈ పత్రాలు స్థల యాజమాన్య హక్కులను ఎంతవరకు నిర్ధారిస్తాయనే అంశాన్ని సంబంధిత అధికారులు, అవసరమైతే న్యాయస్థానం పరిశీలించాల్సి ఉంటుంది. బాధితుడు సమర్పించే పత్రాలతో పాటు స్థలానికి సంబంధించిన ఇతర రికార్డులను కూడా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలి.

**బాధితుడి కన్నీటి గోడు..**
**మా కుటుంబాన్ని ఆదుకోండి!**

"మా తండ్రి నివాసం ఉన్న ఇంటి స్థలంలోనే మేము గత 50 ఏళ్లుగా ఉంటున్నాం. మా ఇంటికి సంబంధించి కురవి మేజర్ గ్రామ పంచాయతీ ఇంటిపన్ను రసీదు ఉంది. కరెంట్ బిల్లులు ఉన్నాయి. ప్రభుత్వం ద్వారా మిషన్ భగీరథ నీటి పైపులైన్ కనెక్షన్ కూడా ఉంది. ఇన్ని ఆధారాలు ఉన్నా కొందరు వ్యక్తులు ఈ ఇంటి స్థలం మాదంటూ మా గుడిసెను ధ్వంసం చేసి, స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. మా కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నాం. ప్రజా సంఘాలు స్పందించి, సంబంధిత అధికారులు న్యాయ విచారణ జరిపేలా కృషి చేసి, మా కుటుంబాన్ని ఆదుకోవాలి" అని బాధితుడు కన్నీటితో వేడుకుంటున్నాడు.

**కులవృత్తే జీవనాధారం.. గుడిసెనే ఆధారం!**

నిమ్మశెట్టి వెంకన్న కుటుంబం కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తోంది. బుట్టలు తయారు చేసి విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఈ నిరుపేద కుటుంబానికి నివాస స్థలం, గుడిసె అత్యంత కీలకమైనవి. ఇలాంటి కుటుంబం నివాస భద్రతకు సంబంధించిన సమస్యను అధికారులు తేలికగా తీసుకోకూడదు. పేదవాడికి ఆర్థిక బలం లేకపోవచ్చు.. రాజకీయ పలుకుబడి లేకపోవచ్చు.. కానీ న్యాయం పొందే హక్కు మాత్రం అందరికీ సమానమే. అందుకే ఈ వివాదంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి, అన్ని పక్షాల వాదనలు విని, రికార్డుల ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**ఎరుకల సంఘం నాయకులు ఎక్కడ?**

ఏకలవ్యుడిని ఆదర్శంగా భావించే ఎరుకల సమాజంలో, అదే కులానికి చెందిన నిరుపేద కుటుంబం సమస్యను ఎదుర్కొంటున్నప్పుడు సంఘాల నాయకులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ఎరుకల సంఘం నాయకులు, కుల పెద్దలు, ప్రజా సంఘాల ప్రతినిధులు బాధిత కుటుంబాన్ని కలిసి వివరాలు తెలుసుకోవాలి. స్థల వివాదానికి సంబంధించిన పత్రాలను పరిశీలించి, బాధితుడికి న్యాయం జరిగేలా చట్టబద్ధమైన మార్గాల్లో కృషి చేయాలి. ప్రజా సమస్యలపై పోరాడతామని చెప్పే నాయకులు ఇలాంటి సందర్భాల్లో బాధితుల పక్షాన నిలబడి, సమస్య పరిష్కారానికి కృషి చేయడం అవసరం. అయితే, వివాదానికి సంబంధించిన వాస్తవాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలి.

**అధికారుల న్యాయ విచారణ ఎప్పుడు?**

నిమ్మశెట్టి వెంకన్న కుటుంబం చేస్తున్న ఆరోపణలపై సంబంధిత రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించాలి. ఇంటిపన్ను రసీదు, విద్యుత్ బిల్లులు, నీటి కనెక్షన్ వివరాలతో పాటు స్థలానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, సర్వే వివరాలను పరిశీలించాలి. గుడిసెను ధ్వంసం చేసేందుకు ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలపై కూడా విచారణ జరపాలి. చట్టబద్ధమైన హక్కులు, స్థల సరిహద్దులు నిర్ధారించే వరకు ఎలాంటి బలవంతపు చర్యలు జరగకుండా చట్టప్రకారం తగిన రక్షణ కల్పించే అంశాన్ని పరిశీలించాలి. బాధిత కుటుంబానికి అర్హత ఉంటే ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందించే అవకాశాలను కూడా అధికారులు పరిశీలించాలి.

**పేదవాడికి న్యాయం జరగాలి**

యాభై ఏళ్లుగా నివాసం ఉంటున్నామని చెబుతున్న కుటుంబం.. తమ వాదనకు మద్దతుగా పత్రాలు ఉన్నాయని పేర్కొంటున్న బాధితుడు.. మరోవైపు స్థలంపై వివాదం.. ఈ నేపథ్యంలో అసలు వాస్తవాలు ఏమిటో నిష్పక్షపాత విచారణ ద్వారానే తేలాలి. నిమ్మశెట్టి వెంకన్న కుటుంబానికి న్యాయం జరుగుతుందా? ప్రజా సంఘాలు స్పందిస్తాయా? ఎరుకల సంఘం నాయకులు అండగా నిలుస్తారా? అధికారులు సమగ్ర విచారణ జరిపి సమస్యకు పరిష్కారం చూపుతారా? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు మారడం మాత్రమే అభివృద్ధి కాదు.. పేదవాడికి భద్రత కలగాలి. కష్టపడి జీవించే కార్మికుడికి గౌరవం దక్కాలి. తన నివాసాన్ని కాపాడుకోవడానికి ఒక నిరుపేద కుటుంబం కన్నీరు పెట్టుకోవాల్సిన పరిస్థితి రాకూడదు. న్యాయ విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తెచ్చి, అర్హులైన బాధితులకు న్యాయం చేయడమే ప్రజాస్వామ్య వ్యవస్థ బాధ్యత.

## కాంట్రాక్ట్ అధ్యాపకుల పట్ల సీఎం చొరవ చూపాలి

- యునైటెడ్ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్ట్




**ముషీరాబాద్,విశాల భారతి:** 30 సంవత్సరాలుగా కాంట్రాక్టు అధ్యాపకులుగా కొనసాగుతున్న మాపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని యునైటెడ్ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్ట్ విజ్ఞప్తి వేసింది. కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏడవ పిఆర్సి అమలు చేసి వేతనాలు పెంచాలని కోరింది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని పేర్కొంది. యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామక ప్రక్రియ ప్రారంభించే ముందు యూజీసీ నిబంధనల ప్రకారం అర్హతలున్న 1,200 మంది కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పరుశురాం మాట్లాడారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో గత 30 ఏళ్లుగా కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్న తాము శ్రమదోపిడీకి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి క్రమబద్ధీకరణకు హామీ ఇచ్చినా కొంతమంది ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా అది అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామక ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో తొలుత అర్హతలున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించి అనంతరం మిగిలిన ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే తమకు ఏడో వేతన సవరణ సంఘం (పీఆర్సీ) సిఫారసులతో పాటు యూజీసీ పే స్కేళ్లను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ పద్ధతిలో తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్ల జోలికొస్తే చర్యలు తప్పవు!

- హక్కులు హరిస్తే ఖాకీ కొరడా!
- ట్రాన్స్‌జెండర్ల రక్షణకు మహబూబాబాద్‌లో ప్రత్యేక ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటు.
- వేధింపులు, బెదిరింపులు, వివక్షకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు
- ఫిర్యాదు అందిన వెంటనే స్పందన.. బాధితులకు తక్షణ పోలీస్ సహాయం
- హక్కులు, ఆత్మగౌరవానికి భంగం కలిగితే కఠినంగా వ్యవహరిస్తాం
- మహబూబాబాద్ డీఎస్పీ గండ్రతి మోహన్
- ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ఫిర్యాదుల స్వీకరణ
- బాధితులకు పోలీసుల భరోసా

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** ట్రాన్స్‌జెండర్ వ్యక్తులను వేధిస్తూ, బెదిరిస్తూ, వివక్షకు గురిచేస్తూ వారి హక్కులు, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వారికి ఇకపై చట్టపరమైన చర్యలు తప్పవని మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ స్పష్టం చేసింది. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల భద్రత, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక రక్షణ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. మహిళా పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ (అడ్మిన్) గండ్రతి మోహన్ వెల్లడించారు.

**హక్కులను హరిస్తే ఉపేక్షించేది లేదు**

ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల పట్ల వివక్ష చూపడం, వేధించడం, బెదిరించడం, వారి గౌరవానికి భంగం కలిగించడం వంటి చర్యలను సహించబోమని డీఎస్పీ స్పష్టం చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, భద్రత, న్యాయం లభించాల్సిందేనని పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ల ప్రాథమిక హక్కులు, ఆత్మగౌరవానికి భంగం కలిగించే చర్యలపై ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి, చట్టానికి లోబడి చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పారు.

**వేధింపులకు పాల్పడితే చట్టం ముందు నిలవాల్సిందే**

ట్రాన్స్‌జెండర్ వ్యక్తులను ఎవరైనా వేధించినా, బెదిరించినా, అవమానించినా లేదా వారి హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరించినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. బాధితులు సమస్యను భరించాల్సిన అవసరం లేదని, భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో పోలీస్ రక్షణ కల్పిస్తామని తెలిపారు. బాధితులకు చట్టపరమైన మార్గాలపై అవగాహన కల్పించడంపైనా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. జిల్లా ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్‌కు నోడల్ అధికారిగా డీఎస్పీ (అడ్మిన్) గండ్రతి మోహన్ వ్యవహరించనున్నారు. సెల్ నిర్వహణ, ఫిర్యాదుల స్వీకరణ, బాధితులకు సహాయం, సంబంధిత శాఖలతో సమన్వయం వంటి బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించారు.

## తరుగు పేరుతో రైతుల నోట్లో మట్టి

- టన్నుకు 10 కిలోల కోతతో రూ.32 లక్షల నష్టం..రైతుల సొమ్ము తిరిగి చెల్లించాలి
- మూడు కేంద్రాలకు ఒక్క కాంట్రాక్టరేంటి?.. కలెక్షన్ కేంద్రాలు పెంచాలి
- రైతులను నష్టపరిచిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి: నల్లు సుధాకర్‌రెడ్డి

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్**

ఆయిల్‌ఫామ్ గెలల కొనుగోళ్లలో రైతులపై తరుగు పేరుతో అదనపు కోతలు విధిస్తూ నష్టపరుస్తున్న వ్యవహారంపై ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టన్నుకు 10 కిలోల చొప్పున కోత విధించి రైతుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లో తిరిగి జమ చేయాలని, రైతులకు నష్టం కలిగించిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయిల్‌ఫెడ్ అధికారులను డిమాండ్ చేశారు. కురవి మండలం కందికొండలోని ఆయిల్‌ఫామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన నల్లు సుధాకర్‌రెడ్డి.. అక్కడి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయిల్‌ఫామ్ గెలలు పచ్చిగా ఉన్నాయంటూ, తరుగు వస్తుందంటూ ఒక్కో టన్నుకు 10 కిలోల చొప్పున కోత విధిస్తున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.



**రూ.32 లక్షలు ఎవరి జేబులోకి?**

మహబూబాబాద్ జిల్లాలో ఆయిల్‌ఫామ్ సాగు విస్తరిస్తున్నా.. గెలల కొనుగోళ్లలో రైతులకు మాత్రం నష్టం తప్పడం లేదని సుధాకర్‌రెడ్డి అన్నారు. తొర్రూరు, కందికొండ, కేసముద్రంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ మూడు కేంద్రాలకు ఒకే కాంట్రాక్టర్ ఉండటం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు తరుగు పేరుతో విధించిన కోతల కారణంగా రైతులు దాదాపు రూ.32 లక్షలు నష్టపోయినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఆయిల్‌ఫెడ్ అధికారులు విచారణ జరుపుతున్నప్పటికీ.. విచారణ పేరుతో జాప్యం చేయకుండా తక్షణమే పూర్తి చేసి, వాస్తవంగా నష్టపోయిన రైతులను గుర్తించి వారి సొమ్మును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు చెమటోడ్చి పండించిన పంటలో అన్యాయంగా కోత విధిస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

**ఒక్క ఇన్‌చార్జ్‌తో మూడు కేంద్రాలా?**

మూడు కొనుగోలు కేంద్రాలకు ఒక్కరే కలెక్షన్ ఇన్‌చార్జ్‌గా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆయా కేంద్రాలకు ప్రత్యేకంగా కలెక్షన్ ఇన్‌చార్జిలను నియమించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రైతులు గంటల తరబడి వేచి ఉండే పరిస్థితికి స్వస్తి పలకాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 9,600 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగు కొనసాగుతోందని, భవిష్యత్‌లో మరింత విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని కలెక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

**గోపాలగిరిలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి.**

ఆయిల్‌ఫామ్ రైతులకు మరింత ప్రయోజనం కలిగేలా గోపాలగిరిలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని నల్లు సుధాకర్‌రెడ్డి కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఆయిల్‌ఫెడ్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. రైతుల పంటకు న్యాయమైన ధర, పారదర్శకమైన తూకం, కోతల విషయంలో స్పష్టమైన విధానం ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల శ్రమను దోచుకునే విధానాలకు అడ్డుకట్ట వేయాలని, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగే వరకు అధికారులు చర్యలు తీసుకోవాలని సుధాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్షన్ ఇన్‌చార్జ్ కపిల్, రైతులు మల్లారెడ్డి, నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి

- తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో భేటీ
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అంశాలపై చర్చ

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆయనకు అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. పట్టభద్రుల నియోజకవర్గ పరిధి, ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిసింది. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## క్రికెట్ యువ ప్రతిభకు ఇదే వేదిక

- హయత్‌నగర్ జోన్ అండర్-17 ఎంపికలు 11న!
- మన్నెగూడ ప్లే మేకర్స్ అకాడమీలో సెలెక్షన్స్..
- ఉదయం 9 గంటలకు హాజరు కావాలని నిర్వాహకుల సూచన

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** పాఠశాల స్థాయి క్రికెట్‌లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలనుకునే యువ క్రీడాకారులకు మరో అవకాశం లభించనుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి హయత్‌నగర్ జోన్ అండర్ 17 బాలుర క్రికెట్ జోనల్ స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 11వ తేదీ ఆదివారం నిర్వహించనున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ మండలాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చని హయత్‌నగర్ జోనల్ సెక్రటరీ ఎ. నిర్మల తెలిపారు.

**మన్నెగూడలో క్రికెట్ ఎంపిక పోటీలు**

మన్నెగూడలోని ప్లే మేకర్స్ క్రికెట్ అకాడమీలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. సంబంధిత పాఠశాలల స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (ఎస్ఏపీఈలు), పీఈటీలు, కోచ్‌లు తమ పాఠశాలల అర్హులైన క్రీడాకారులకు సమాచారం అందించి ఎంపికల్లో పాల్గొనేలా చూడాలని కోరారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆదివారం ఉదయం 9 గంటలకు తప్పనిసరిగా మైదానానికి చేరుకోవాలని సూచించారు. తమ క్రికెట్ నైపుణ్యాలను ప్రదర్శించి ఎంపికయ్యేందుకు విద్యార్థులు సిద్ధంగా రావాలని తెలిపారు.

**క్రీడాకారులకు ముఖ్య సూచనలు**

ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు తమ భోజనాన్ని లంచ్ బాక్స్ రూపంలో వెంట తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు. ఈ సమాచారాన్ని సంబంధిత విద్యార్థులు, తల్లిదండ్రులు, శారీరక విద్యా ఉపాధ్యాయులు, కోచ్‌లకు తప్పనిసరిగా తెలియజేయాలని కోరారు. ఎంపికలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం ఫిజికల్ డైరెక్టర్ చంద్రమోహన్ కోహెడను సంప్రదించాలని ఎస్‌జీఎఫ్‌ఐ హయత్‌నగర్ జోనల్ సెక్రటరీ ఎ. నిర్మల తెలిపారు.

## బాటసింగారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- రంగురంగుల పూలతో బతుకమ్మల అలంకరణ.. పాటలు, సంప్రదాయ నృత్యాలతో సందడిగా వేడుకలు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పూల పండుగను పురస్కరించుకొని బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గుంటి వెంకటస్వామి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థినీ, విద్యార్థులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను అలంకరించి పాఠశాలకు తీసుకురావడంతో ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది.

**తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక**

ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గుంటి వెంకటస్వామి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని, పూలను ఆరాధిస్తూ మహిళలు ప్రత్యేకంగా జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఇలాంటి పండుగల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరూ కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, భవిష్యత్తులో మంచి స్థానాల్లో స్థిరపడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

**పూల పరిమళాల మధ్య పాటలు, నృత్యాలతో సందడి**

వేడుకల్లో భాగంగా విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. పాఠశాల ప్రాంగణమంతా పూల పరిమళాలు, పాటలతో సందడిగా మారింది. అనంతరం సంప్రదాయబద్ధంగా బతుకమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ సంబరాలను నిర్వహించడంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బాటసింగారం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి రోడ్డు ప్రమాదం.. వడ్రంగి మృతి



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పెద్ద షాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నార్కూడ గ్రామానికి చెందిన కమ్మరి హరీష్ చారి (31) వడ్రంగి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 8వ తేదీ రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అదే రోజు రాత్రి హరీష్ చారి తన స్నేహితులు పవన్, గణేష్, మణి అలియాస్ మహేష్‌లతో కలిసి నార్కూడ గ్రామ శివారులో మద్యం సేవించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అనంతరం గణేష్, మణి తమ ఇళ్లకు వెళ్లిపోగా, హరీష్ చారి తన ద్విచక్ర వాహనంపై పవన్‌ను సుల్తాన్‌పల్లి గ్రామంలో దింపేందుకు వెళ్లాడు. పవన్‌ను అక్కడ దింపిన తర్వాత తిరిగి నార్కూడలోని తన ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో సుల్తాన్‌పల్లి గ్రామ పరిధిలోని బురాన్ ఫామ్‌హౌస్ సమీపానికి చేరుకోగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో హరీష్ చారి తల, నుదుటిపై తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు పక్కన ఉన్న రాయికి తల తగలడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. శుక్రవారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో సుల్తాన్‌పల్లి గ్రామానికి చెందిన దేవేందర్ ఈ విషయాన్ని మృతుడి అన్న కమ్మరి ప్రకాష్‌కు ఫోన్ ద్వారా తెలియజేశాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని హరీష్ చారి మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం మృతుడి తండ్రి కమ్మరి రాములు చారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పెద్ద షాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు పెద్ద షాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వై. సురేందర్ రెడ్డి తెలిపారు.

## అబ్దుల్లాపూర్‌మెట్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ చి. రాజు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ఇన్‌స్పెక్టర్ చి. రాజు బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం (అక్టోబర్ 9, 2026) మధ్యాహ్నం 2:05 గంటలకు ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారంలో కొత్త ఎస్‌హెచ్‌ఓగా చి. రాజు ఎలాంటి చర్యలు చేపడతారనే అంశంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది

## బతుకమ్మ ఉత్సవాలకు అంగరంగ వైభవంగా ఏర్పాట్లు ప్రారంభం



**కూకట్ పల్లి విశాల భారతి:** ఈ సంవత్సరం అమావాస్య రెండు రోజులు ముందు బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రతిరోజు సాయంత్రం సమయంలో కూకట్పల్లి గ్రామంలో పలుచోట్ల మరియు కూకట్పల్లి హనుమాన్ దేవాలయం వద్ద సాయంకాలం ఐదు గంటల నుండి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అక్కడ ఆటలు ఆడిన తర్వాత బతుకమ్మలను పిఎన్ఎం స్కూల్ గ్రౌండ్ వద్ద మళ్లీ బతకమ్మలాడి తదనంతరం రంగదాముని చెరువులో నిమజ్జనం చేస్తారు అని, అక్కడ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే శ్రీ మాధవరం కృష్ణారావు గారు పర్యవేక్షించి అధికారులకి ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తూ బతుకమ్మలు ఆడేందుకు వచ్చే ప్రతి ఆడపడుచులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని మున్సిపల్ శాఖ మరియు పోలీసు శాఖ వారికి కోరడం జరిగింది. 18.10.26 తారీకున పెద్ద బతుకమ్మ ఏర్పాట్లు అంగరంగ వైభవంగా జరుగుతాయని బతుకమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

# అవన్నీ టైంపాస్ ముచ్చట్లు

సోషల్‌మీడియాలో తన పారితోషికం గురించి వస్తున్న రూమర్స్‌పై కథానాయిక శ్రీనిధి శెట్టి స్పందించింది. ఒక్కో సినిమాకు తాను 8కోట్ల వరకు పారితోషికం అందుకుంటున్నాననే ప్రచారం జరుగుతున్నదని, అందులో నిజంలేదని స్పష్టం చేసింది. 'నేను చేసిన సినిమాలే చాలా తక్కువ. అలాంటప్పుడు అంత పెద్ద మొత్తంలో డబ్బులు ఎవరిస్తారు? ఎవరో కొందరు టైంపాస్ కోసం ఇలాంటి రూమర్స్‌ను వ్యాప్తి చేస్తుంటారు. వాటిని అస్సలు పట్టించుకోవద్దు' అని శ్రీనిధిశెట్టి వివరణ ఇచ్చింది. ఒకవేళ డబ్బు తనకు ప్రధానమైతే ఇప్పటికే ఓ ముప్పై చిత్రాల్ని అంగీకరించేదాన్నని, కెరీర్ ఆరంభం నుంచి మంచి కథలకే ప్రాధాన్యం ఇస్తూ సినిమాల్ని ఎంపిక చేసుంటున్నానని ఈ భామ తెలిపింది. 'కేజీఎఫ్' ఫ్రాంచైజీ చిత్రాలతో దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు చేరువైంది శ్రీనిధి శెట్టి. ఆ తర్వాత తెలుగులో హిట్-3, తెలుసు కదా వంటి చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం ఈ కన్నడ సొగసరి వెంకటేష్‌తో కలిసి 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటించింది. త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.